1st Year
Happy Work Anniversary.

షణ్ముఖ
RNI : APTEL / 2023 / 89152
SHANMUKHAVELUGU
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF PEN

సంపుటి : 2 సంచిక : 219 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 06 జులై 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 219 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Sunday 06 July 2025 PAGES : 8 PRICE : 3/-

# ఆగస్టుకల్లా కొత్త పాస్ పుస్తకాలు

**రీసర్వే పూర్తయిన గ్రామాల్లో అందించాలి**
**సచివాలయాల్లో వారసత్వ భూముల భాగస్వామ్య రిజిస్ట్రేషన్లు**
**పేదలకు ఇళ్లు, జర్నలిస్టుల స్థలాల కోసం మంత్రులతో కమిటీ**
**రెవెన్యూ శాఖపై సమీక్షలో సీఎం**



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 05)**
ఈనాడు, అమరావతి: "వారసత్వ భూముల సంక్రమణ భాగస్వామ్య (సక్సెషన్) రిజిస్ట్రేషన్లను రూ.100 రుసుముతో గ్రామ/ వార్డు సచివాలయాల్లోనే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలి. సదరు ఆస్తి విలువ రూ.10 లక్షలు దాటితే రూ.1,000 ఫీజు తీసుకోవాలి. యజమాని మరణించాక జరిగే వారసత్వ సంక్రమణ భాగస్వామ్య రిజిస్ట్రేషన్లే సచివాలయాల్లో చేయాలి. ఈ మేరకు గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బందికి అధికారాలు ఇవ్వాలి" -మిగతా 2లో

## జడ్జీల ఎంపికలో అన్ని వర్గాలకూ ప్రాతినిధ్యం

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 05)**
జడ్జీల నియామకాన్ని చేపట్టే కొలీజియం విధానంలో పూర్తి పారదర్శకత తీసుకొస్తామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బి.ఆర్. గవాయ్ పేర్కొన్నారు. అభ్యర్థుల ప్రతిభా పాటవాల విషయంలో రాజీ పడే ప్రసక్తేలేదని, సమాజంలోని అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తామని ఆయన వెల్లడించారు. శుక్రవారం బాంబే బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాంబే హైకోర్టులో జరిగిన సన్మాన కార్యక్రమంలో సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు. తనకు పూర్వం ప్రధాన న్యాయమూర్తిగా పని చేసిన జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవీ -మిగతా 2లో



## చిన్నారుల కలల సాకారానికి అండగా నిలుస్తాం

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 05)**
తమకు చదువు చెప్పించాలంటూ నెల్లూరు కమిషనర్‌కు ఇద్దరు చిన్నారులు విజ్ఞప్తి చేయడంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. చదువు కోసం కమిషనర్‌ను చిన్నారులు ప్రాధేయపడటం కలచివేసిందన్నారు. 'ఓ సారూ.. మాకూ చదువు చెబుతారా?' అంటూ ఇద్దరు చిన్నారులపై ఈటీవీ భారత్‌లో వచ్చిన కథనంపై నారా లోకేశ్ స్పందించారు. చిన్నారులు పెంచలయ్య, వెంకటేశ్వర్ల చదువుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పేదరికం నుంచి బయటకు తెచ్చే ఒకే ఒక్క సాధనం విద్య అని, చిన్నారులు తమ కలలను సాకారం చేసుకునేందుకు అండగా నిలుస్తామని అన్నారు.



## ఐదేళ్లు అరాచకాలు చేసి.. ఇప్పుడు నీతులు చెబుతున్నారా? మంత్రి కొల్లు రవీంద్ర



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 05)**
వైకాపా ఖాళీ అవడం ఖాయమని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. వైకాపా నాయకులు అధికారం కోల్పోవడంతో మతిభ్రమించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఐదేళ్లు అరాచకాలు చేసి, ప్రజలను పీడించుకొని తిని.. ఇవాళ నీతులు చెబుతున్నారని ధ్వజమెత్తారు. త్వరలో వైకాపా కార్యాలయానికి టూ-లెట్ బోర్డు పెట్టబోతున్నారని.. అందుకే ఆందోళనలో ఆ పార్టీ నాయకులు ఏదేదో మాట్లాడుతున్నారని అన్నారు.బియ్యం కొట్టేసిన దొంగతో ప్రెస్ మీట్ పెట్టించడం సిగ్గుమాలిన చర్య అని పేర్కొన్నారు. దొంగలతో ప్రయాణం చేస్తున్న జగన్ రెడ్డి.. పెద్ద దొంగ అని మంత్రి అన్నారు. సింగయ్య మృతికి సంబంధించి విజువల్స్ అంతా క్లియర్‌గా ఉంటే తమకు ఎలాంటి సంబంధం లేదని జగన్ రెడ్డి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగయ్య మృతితో ఎలాంటి సంబంధం లేనప్పుడు కుటుంబాన్ని ఎందుకు పరామర్శించారని మంత్రి ప్రశ్నించారు. కక్షపూరిత రాజకీయాలకు జగన్ కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయారని విమర్శించారు.

## కమ్లా.. బిహార్ ముద్దుబిడ్డే: మోదీ

**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూలై 05)**
అయోధ్యలోని సరయూ నది జలాలు, రామమందిరం ప్రతిమ, మహాకుంభ మేళా జలాలను ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రధాని కమ్లా పర్సాద్-బిసెసర్‌కు మోదీ అందజేశారు. 1999 తర్వాత ట్రినిడాడ్ అండ్ టొబాగోలో భారత ప్రధాని తొలి ద్వైపాక్షిక పర్యటన ఇదే. ఈ సందర్భంగా భారత సంతతి ప్రజలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేంలో మోదీ మాట్లాడుతూ..ట్రినిడాడ్ అండ్ టొబాగోకు బిహార్‌తో ఉన్న సంబంధాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రధాని కమ్లా పర్సాద్-బిసెసర్ పూర్వీకులు ఆ రాష్ట్రం నుంచే వచ్చారని గుర్తుచేశారు. భారతీయులు ఆమెను బిహార్ ముద్దుబిడ్డగా పరిగణిస్తుంటారని చెప్పారు. ఆ రాష్ట్ర వారసత్వం భారత్‌కే కాకుండా యావత్ ప్రపంచానికి గర్వకారణమని వ్యాఖ్యానించారు.



## మరో 30-40 ఏళ్లు జీవించాలని ఆశగా ఉంది: దలైలామా

**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూలై 05)**
టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా వారసుడి ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని..ఆయన ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన తన మనసులోని మరో విషయాన్ని బయటపెట్టారు. జులై 6న తన 90వ పుట్టిన రోజు వేడుక నిర్వహించుకోనున్న నేపథ్యంలో.. ఆయన అనుచరులు దలైలామా దీర్ఘాయుష్షు కోసం పలు ప్రార్థనలు నిర్వహించారు. అందులోభాగంగా టిబెట్ బౌద్ధమత గురువు మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేస్తూ మరో 30-40 ఏళ్లు జీవించాలని ఉందనే తన ఆకాంక్షను వ్యక్తంచేశారు. మరికొన్నేళ్లు ఆరోగ్యంగా జీవించగలననే దేవుని స్పష్టమైన సంకేతాలు తనకు అందుతున్నాయన్నారు. బుద్ధుని బోధనల వ్యాప్తికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. గతంలోనూ దలైలామా తన ఆయుష్షు గురించి మాట్లాడుతూ..తాను 110 ఏళ్లు జీవిస్తానని ఓ కల వచ్చినట్లు పేర్కొన్నారు.
ప్రస్తుతం తనకు 90 ఏళ్లు నిండటంతో 15వ దలైలామా ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని.. దానిని నిర్వహించే అధికారం గాడెన్ ఫోడ్రోంగ్ ట్రస్ట్‌కు -మిగతా 2లో



## కృత్రిమ మేధతో పన్ను ఎగవేతదారుల కట్టడి

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 05)**
దేశంలో పన్ను ఎగవేతదారులను కట్టడి చేసేందుకు కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) పరిజ్ఞానాన్ని వినియోగిస్తే సత్ఫలితాలు వస్తాయని రాష్ట్ర ఆర్థిక, వాణిజ్య పన్నుల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. జీఎస్టీ పన్నుల సరళిని తరచూ సమీక్షించడానికి కేంద్ర ప్రభుత్వం నియమించిన పలు రాష్ట్రాల మంత్రుల కమిటీ సమీక్ష సమావేశంలో అనంతపురంలోని ఎన్ఐసీ కార్యాలయం నుంచి మంత్రి వర్చువల్‌గా పాల్గొన్నారు. పన్ను ఎగవేతదారుల గుర్తింపు, వారిని ఎలా కట్టడి చేయాలన్న దానిపై మెరుగైన చర్యలు అవసరమని కేశవ్ సూచించారు. జీఎస్టీ వసూలు, లీకేజీలు లేకుండా పలు రాష్ట్రాల్లో అమలు చేస్తున్న మంచి విధానాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. వే బిల్లులు, ఫాస్టాగ్ వంటి అంశాలపైనా లోతుగా చర్చించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. జీఎస్టీకి సంబంధించి అన్ని రాష్ట్రాలూ సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవాలని, దీనికి కూడా ఏఐ వినియోగించుకుంటే మంచిదని వివరించారు.




## సుంకాలపై ట్రంప్ సంతకం.. ఆ 12 దేశాల జాబితాలో భారత్ ఉందా?

**కొన్ని దేశాలపై 70 శాతం వరకు సుంకాలు విధించే అవకాశం**
**అమెరికాతో ఫలించని భారత అధికారుల చర్చలు**

**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూలై 05)**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వాణిజ్య యుద్ధానికి తెరలేపారు. సుమారు 12 దేశాల నుంచి దిగుమతయ్యే వస్తువులపై కొత్తగా సుంకాలు విధించేందుకు ఉద్దేశించిన లేఖలపై ఆయన సంతకాలు చేశారు. దీంతో ఆ జాబితాలో భారత్ ఉందా లేదా అనే తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ సుంకాల నుంచి మినహాయింపు పొందేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నాలు ఇంకా ఓ కొలిక్కి రాలేదు.
ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో ప్రయాణిస్తూ అధ్యక్షుడు ట్రంప్ ఈ విషయాన్ని మీడియాకు వెల్లడించారు. "నేను కొన్ని లేఖలపై సంతకాలు చేశాను. అవి సోమవారం వెల్లడవుతాయి. బహుశా 12 దేశాలకు వేర్వేరు మొత్తాల్లో డబ్బు, వేర్వేరు సుంకాలు ఉంటాయి" అని తెలిపారు. ఆయా దేశాల -మిగతా 2లో



## ఫ్రీహోల్డ్ భూములపై డిసెంబరు నాటికి తుది నివేదిక

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 05)**
నిషిద్ధ జాబితా నుంచి తప్పించిన ఫ్రీహోల్డ్ భూముల విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై తుది నివేదికను అక్టోబరు 2 నాటికి ప్రభుత్వానికి మంత్రివర్గ ఉపసంఘం అందజేస్తుందని రెవెన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రెవెన్యూ శాఖపై శుక్రవారం సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం ముగిసిన అనంతరం సచివాలయంలో మంత్రి విలేకర్లతో మాట్లాడారు. 'నాలా రద్దుపై మంత్రుల ఉపసంఘం సుదీర్ఘంగా చర్చించింది. దీనిపై మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం జరుగుతుంది. భూ వినియోగ మార్పిడికి 4% డెవలప్‌మెంట్ ఛార్జీ ఉండాలని ఉపసంఘం అభిప్రాయపడింది. జర్నలిస్టులకు ప్రభుత్వం స్థలాలు ఇవ్వడంలో చట్టపరమైన ఇబ్బందులు ఉన్నాయి. రిజిస్ట్రేషన్ల శాఖ మార్కెట్ విలువను అనుసరించి స్థలాలు ఇవ్వొచ్చని నేను సూచించా. దీనిపై మంత్రుల కమిటీ నిర్ణయం తీసుకుంటుంది.
గ్రామ సచివాలయాల్లో సర్వేయర్ పోస్టుల కొనసాగింపు రీసర్వే పూర్తయ్యే వరకూ గ్రామ సచివాలయాల్లో సర్వేయర్ల పోస్టులను హేతుబద్ధీకరించకుండా యథావిధిగా కొనసాగించేందుకు సీఎం ఆమోదం తెలిపారు. గ్రామ సచివాలయాల్లోని వీఆర్వోల పోస్టులను హేతుబద్ధీకరించొద్దని ప్రభుత్వాన్ని కోరాను. సర్వే, రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖలను -మిగతా 2లో




## అమరావతికి మరో 20 వేల ఎకరాలు... సీఆర్డీఏ గ్రీన్ సిగ్నల్

**సీఎం చంద్రబాబు నివాసంలో ముగిసిన సీఆర్డీఏ 50వ సమావేశం**
**రాజధానిలో అదనంగా 20,494 ఎకరాల భూ సమీకరణకు ఆమోదం**
**హైడెన్సిటీ రెసిడెన్షియల్ జోన్లకు ఆర్ఎఫ్‌పీ పిలిచేందుకు గ్రీన్ సిగ్నల్**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 05)**
నగరంలో నాలుగు కొత్త కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి ఓకే
నిర్మాణ పనుల కోసం ఇసుక డ్రెడ్జింగ్‌కు సీఆర్డీఏకు అనుమతి
రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. రాజధాని పరిధిలో అదనంగా 20 వేల ఎకరాలకు పైగా భూమిని సమీకరించేందుకు రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్డీఏ) -మిగతా 2లో

# ఆగస్టుకల్లా కొత్త పాస్ పుస్తకాలు

అని రెవెన్యూ అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూ యజమానులకు ఆగస్టు నాటికి కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను అందించాలని సూచించారు. "రాష్ట్రంలో అర్హులైన పేదలకు ఇంటిస్థలాల పంపిణీ రెండేళ్లలో జరగాలి. మరో రెండేళ్లలో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి. దీని ప్రకారం రానున్న నాలుగేళ్లలో ప్రతి ఒక్కరికీ ఇల్లు లక్ష్యాన్ని చేరుకోవాలి. పేదలకు ఇళ్లు, జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు రెవెన్యూ, గృహ నిర్మాణ, మున్సిపల్ శాఖల మంత్రులతో కమిటీని ఏర్పాటుచేయాలి. రాష్ట్రంలో ఇప్పటివరకు 99,390 మంది ఇంటిస్థలాల కోసం దరఖాస్తు చేయగా 2,051 ఎకరాలను సేకరించాలి. గతంతో పోల్చుకుంటే రెవెన్యూశాఖ పనితీరు కొంత మెరుగుపడింది. పూర్తిస్థాయి సంతృప్తి సాధించేందుకు మరింత కష్టపడాలి" అని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ శాఖ పనితీరుపై శుక్రవారం సీఎం సమీక్షించారు.

### 2027 డిసెంబరు నాటికి రీసర్వే పూర్తిచేయాలి

"ప్రతి పట్టాదారు పాసు పుస్తకంపై క్యూఆర్ కోడ్‌తో పాటు ఆధార్ నంబరు ఆధారంగా ప్రతి యజమాని తమ సొంత భూమి వివరాలు తెలుసుకునే వెసులుబాటు కల్పించాలి. ప్రభుత్వం తెచ్చిన కొత్త జీవోలు, విధానాలపై కొత్త రెవెన్యూ మాన్యువల్ ఆగస్టు నాటికి తేవాలి. భూముల రీసర్వే 2027 డిసెంబరు నాటికి పూర్తికావాలి. నాలా చట్టం రద్దుకు కసరత్తు పూర్తిచేసి మంత్రివర్గ సమావేశం ముందుకు తీసుకురావాలి" అని సీఎం స్పష్టంచేశారు.

### ప్రొటోకాల్ విధుల నుంచి మినహాయింపు

"రెవెన్యూ అధికారులను ప్రొటోకాల్ డ్యూటీల నుంచి మినహాయించాలి. మంత్రులు జిల్లాలకు వెళ్లినప్పుడు వాళ్ల శాఖ అధికారులు వెళ్తే చాలు. డిప్యూటీ కలెక్టర్ అనేది పనిష్మెంట్ పోస్టు కాదు. వారికి సదుపాయాలు కల్పించి, వారితో పని చేయించుకోవాలి. వాట్సప్ గవర్నెన్స్‌లో వాడుకలో లేని సర్వీసులను తొలగించాలి. వచ్చే అక్టోబరు నాటికి ప్రతి ఒక్కరికీ శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాల పంపిణీ పూర్తిచేయాలి" అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

### భూ వివరాలు కనిపించేలా పోర్టల్

రెవెన్యూ శాఖ కొత్త పోర్టల్ గురించి సీఎం చంద్రబాబుకు ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి, సీసీఎల్ఏ అదనపు కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి వివరించారు. "రాష్ట్రంలోనూ భూముల స్వరూపాన్ని, ఇతర వివరాలను పోర్టల్ ద్వారా చూడొచ్చు. భూమిని గుర్తించగానే దాని యజమాని, ఇతర వివరాలు కనిపిస్తాయి. ఆ ప్రాంతంలో ఉన్న అడవులు, ప్రభుత్వ భూములు, రోడ్లు, నీటి ప్రాంతాలు, చెరువులు, ఆక్రమణల్లో ఉన్న స్థలాలు, వివాదాల్లో ఉన్న స్థలాల వివరాలు కూడా స్క్రీన్‌పై కనిపిస్తాయి. క్రయ విక్రయాల సమయంలో సులువుగా ఉంటుంది" అని అధికారులు సీఎంకు తెలియజేశారు.

ఈ పోర్టల్‌ను సమగ్రంగా తీసుకురావాలని, మంచి పేరు పెట్టాలని అధికారులకు సీఎం సూచించారు. 'కూటమి ప్రభుత్వ వచ్చాక నిర్వహించిన 17,600 రెవెన్యూ సదస్సుల్లో 1.85 లక్షల దరఖాస్తులు అందాయి. వీటిలో 668 మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి 4,50,603 విజ్ఞప్తులు రాగా, 3,99,645 పరిష్కరించాం. ఆటో మ్యుటేషన్ కింద 1.93 లక్షలు దరఖాస్తులు వస్తే.. వాటిలో 1.77 లక్షలు పరిష్కరించాం. అధికారుల స్థాయిలో పరిష్కరించలేని సమస్యలు, న్యాయపరమైన చిక్కులు ఉంటే అర్జీదారులకు వివరిస్తున్నాం' అని అధికారులు సీఎంకు తెలిపారు.

**మొదటి పేజీ తరువాయి**

# జడ్జీల ఎంపికలో అన్ని వర్గాలకూ ప్రాతినిధ్యం

కాలంలో కొలీజియం పనితీరులో మరింత పారదర్శకత తెచ్చే ప్రయత్నం జరిగిందని జస్టిస్ గవాయ్ తెలిపారు. కొలీజియం వ్యవహారాల్లో కొందరు జోక్యం చేసుకునేందుకు యత్నిస్తున్నారంటూ సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ దీపాంకర్ దత్తా ఇటీవల నాగ్‌పూర్‌లో పేర్కొన్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. 2019లో తనకు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి కల్పించాలని సిఫార్సు చేసినప్పుడు ఒక జడ్జి అందుకు సమ్మతించలేదని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. ఆ జడ్జి ఎవరన్నది వెల్లడించడానికి ఆయన నిరాకరించారు. "నాకు పదోన్నతి కల్పిస్తే ముంబయిలోని కొందరు సీనియర్ లాయర్లు ఆందోళన చెందుతారని ఆ జడ్జి భావించారు. తదనంతరం ముంబయికి చెందిన పలువురు న్యాయవాదులు నన్ను కలిసి ఆ భావన అపోహ మాత్రమే అని చెప్పారు" అని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు.

# మరో 30-40 ఏళ్లు జీవించాలని ఆశగా ఉంది: దలైలామా

మాత్రమే ఉందని ఇటీవల టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా తేల్చిచెప్పారు. ఈమేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. 2011 సెప్టెంబర్ 24నే తాను టిబెట్ బౌద్ధ మత పెద్దలు, నాయకులు, ఇతర సంస్థలతో భేటీ నిర్వహించి.. తన వారసుడి ఎంపిక కొనసాగించాలా..?అనే అంశంపై అభిప్రాయాలు కోరినట్లు పేర్కొన్నారు. దీనికి అన్నివర్గాల నుంచి సానుకూల స్పందనలు వచ్చాయన్నారు. ఈ విషయంలో జోక్యం చేసుకొనే అధికారం ఎవరికీ లేదని చైనాను ఉద్దేశించి అన్నారు.

కాగా.. టిబెట్‌పై పట్టు కోసం భవిష్యత్తులో దలైలామా స్థానాన్ని కబ్జా చేయాలని చైనా భావిస్తోంది. ఆ స్థానం ఎంపికలో పంచయిన్ లామా పాత్ర చాలా కీలకం. టిబెట్‌లోనే ఉండిపోయిన పంచయిన్ లామా 1989లో అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఆయనపై విష ప్రయోగం చేశారంటారు. పంచయిన్ లామా వారసుడిగా ఎంపికైన బాలుడిని తన అధీనంలో ఉంచుకొన్నట్లు కొన్నేళ్ల కిందట బీజింగ్ ప్రకటించింది. ఈ ఎత్తుగడలను గ్రహించిన దలైలామా తన పునర్జన్మ టిబెట్ బయట కూడా జరగొచ్చని ప్రకటించారు. దీంతోపాటు వారసుడిని (పునర్జన్మ పొందిన బాలుడిని) ఎంపిక చేసే ప్రక్రియ కూడా తమదేనని తేల్చిచెప్పారు.

# సుంకాలపై ట్రంప్ సంతకం.. ఆ 12 దేశాల జాబితాలో భారత్ ఉందా?

పేర్లను మాత్రం ఆయన సోమవారమే వెల్లడిస్తామని స్పష్టం చేశారు. ఈ కొత్త సుంకాలు ఆగస్టు 1 నుంచి అమల్లోకి రావచ్చని, కొన్ని దేశాలపై ఇది 70 శాతం వరకు కూడా ఉండే అవకాశం ఉందని ట్రంప్ సంకేతాలు ఇచ్చారు. మరోవైపు అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు వెళ్లిన భారత ఉన్నతస్థాయి అధికారుల బృందం చర్చలు ముగించుకుని వెనక్కి వచ్చింది. అమెరికా కోరుతున్న వ్యవసాయ, డెయిరీ ఉత్పత్తుల మార్కెట్ ప్రవేశంపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో చర్చలు అసంపూర్తిగా ముగిశాయి. భారత ప్రతినిధి బృందానికి ముఖ్య సంధానకర్త రాజేశ్ అగర్వాల్ నేతృత్వం వహించారు. జులై 9లోగా సుంకాల నుంచి మినహాయింపు పొందేందుకు ఇరు దేశాల మధ్య రాజకీయ స్థాయిలో చివరి నిమిషంలో ఒప్పందం కుదరవచ్చని ఇంకా ఆశలు మిగిలే ఉన్నాయి. అయితే, ఏ గడువుకూ లోబడి వాణిజ్య ఒప్పందాలు చేసుకోబోమని భారత వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్ ఇప్పటికే స్పష్టం చేశారు. దేశ ప్రయోజనాలకే తమ తొలి ప్రాధాన్యత అని ఆయన తేల్చిచెప్పారు. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు భారత్‌లో విస్తృత మార్కెట్ కల్పించాలన్నది ప్రధాన అడ్డంకిగా మారింది. ఈ అంశం దేశంలోని చిన్న రైతుల జీవనోపాధితో ముడిపడి ఉండటంతో భారత్ దీనిని సున్నితమైన విషయంగా పరిగణిస్తోంది. అదే సమయంలో భారత్ నుంచి ఎగుమతయ్యే టెక్స్‌టైల్స్, లెదర్, పాదరక్షలు వంటి వాటిపై సుంకాల రాయితీలు కోరుతోంది. దీంతో జులై 9 గడువు సమీపిస్తున్న వేళ ఏం జరగనుందనేది ఆసక్తికరంగా మారింది.

# ఫ్రీహోల్డ్ భూములపై డిసెంబరు నాటికి తుది నివేదిక

బ్లాక్‌చైన్ టెక్నాలజీ ద్వారా అనుసంధానం చేయబోతున్నాం. 40 వేల మంది రైతులు పట్టాదారు పాసు పుస్తకాలు లేకున్నా బ్యాంకుల నుంచి రుణాలు పొందారు. ఎస్టీలు ఉన్న 363 ఆవాసాల్లో మూడు దశల్లో శ్మశానవాటికల నిర్మాణానికి రూ.137 కోట్ల మంజూరుకు సీఎం ఆమోదం తెలిపారు. రెవెన్యూ శాఖ పనితీరు చాలా బాగుందని ప్రజాభిప్రాయ సేకరణలో తేలింది. సదస్సులలో వచ్చిన అర్జీల పరిష్కారంపై సేకరించిన అభిప్రాయంలో 2.5 మార్కులతో ప్రథమస్థానంలో ఉన్నాం. పీజీఆర్ఎస్‌లో రెవెన్యూ శాఖకు ఐదో స్థానం లభించింది. రెవెన్యూ శాఖ పనితీరు బాగుందని సీఎం చంద్రబాబు అభినందించారు' అని అనగాని వివరించారు. విలేకర్ల సమావేశంలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి, సీసీఎల్ఏ అదనపు కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

# అమరావతికి మరో 20 వేల ఎకరాలు... సీఆర్డీఏ గ్రీన్ సిగ్నల్

అథారిటీ ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఉండవల్లిలోని నివాసంలో జరిగిన 50వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో మొత్తం 7 ప్రధాన అంశాలపై చర్చించి ఆమోదముద్ర వేశారు. ఇందులో భాగంగా అమరావతి, తుళ్లూరు మండలాల్లోని ఏడు గ్రామాల్లో కలిపి మొత్తం 20,494 ఎకరాల భూమిని సమీకరించాలన్న ప్రతిపాదనకు అథారిటీ పచ్చజెండా ఊపింది. దీంతో పాటు, రాజధానిలో అభివృద్ధి పనులను పరుగులు పెట్టించేందుకు మరికొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. మందడం, రాయపూడి, పిచుకలపాలెం వంటి ప్రాంతాల్లో హైడెన్సిటీ రెసిడెన్షియల్ జోన్లు, మిశ్రమ అభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణం కోసం ఆసక్తి వ్యక్తీకరణ (ఆర్ఎఫ్‌పీ) పిలిచేందుకు అనుమతించారు.

అంతేకాకుండా, అమరావతిలో నిర్మించనున్న ఫైవ్‌స్టార్ హోటళ్లకు సమీపంలో నాలుగు చోట్ల కన్వెన్షన్ సెంటర్లను నిర్మించే ప్రతిపాదనకు కూడా ఆమోదం లభించింది. రాజధాని నిర్మాణ పనులకు ఇసుక కొరత లేకుండా చూసేందుకు, ప్రకాశం బ్యారేజీ ఎగువన డీసిల్టేషన్ ప్రక్రియ ద్వారా ఇసుకను తవ్వుకునేందుకు సీఆర్డీఏకు అనుమతి ఇచ్చారు. రానున్న రెండేళ్లలో నిర్మాణాలకు 159.54 క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరమవుతుందని అధికారులు అంచనా వేశారు. కేబినెట్ సబ్ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు సీబీఐ, జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడెమీ, ఎమ్మెస్కే ప్రసాద్ క్రికెట్ అకాడెమీ, కిమ్స్ హాస్పిటల్ సహా 16 ప్రముఖ సంస్థలకు 65 ఎకరాల భూమిని కేటాయించేందుకు కూడా సీఆర్డీఏ అంగీకరించింది. వీటితో పాటు రాజధానిలోని ఈ–15 రహదారిపై ఆరు లేన్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణానికి, పొట్టి శ్రీరాములు, అల్లూరి సీతారామరాజు స్మారక చిహ్నాల ఏర్పాటుకు స్థలం కేటాయించేందుకు కూడా ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మంత్రి గొట్టిపాటి బాసట

**విడతల వారీగా 10,000 సైకిళ్ల ఉచిత పంపిణీకి ఏర్పాట్లు**
**తొలి దశలో అద్దంకి విద్యార్థినులకు 554 సైకిళ్లు అందజేత**
**ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెంపుకు కృషి**
**మంత్రి గొట్టిపాటి సైకిళ్ల పంపిణీపై సర్వత్రా హర్షం**



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, జులై 5)

విద్య ఒక్కటే జీవితానికి వెలుగునిచ్చే దీపం అన్న స్వామి వివేకానంద సూక్తిని ఆదర్శంగా తీసుకున్న ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్... అద్దంకి నియోజకవర్గ పరిధిలో లక్షల రూపాయిల నిధులతో పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారు. ఒక వైపు పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పిస్తూనే... బాల, బాలికలను పాఠశాల విద్యకు మరింత దగ్గర చేస్తున్నారు. విద్యార్థులెవరూ దూరాభారంతో పాఠశాలలకు దూరం కాకూడదన్న సత్సంకల్పంతో... అద్దంకి నియోజకవర్గ పరిధిలో 10,000 సైకిళ్లను విద్యార్థులకు ఉచితంగా అందజేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నియోజకవర్గ పరిధిలోని బల్లికురవ, సంతమాగులూరు, కొరిశపాడు, జె.పంగులూరు, అద్దంకి మండల్లాల్లోని ఉన్నత పాఠశాలల్లోని అవసరం అయిన విద్యార్థులకు సీఎస్ఆర్ నిధుల ద్వారా సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ఇప్పటికే ప్రారంభించారు. తొలి దశలో... మొదటి విడతగా అద్దంకి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు 554 సైకిళ్లను పంపిణీ చేసిన మంత్రి గొట్టిపాటి... మరో 1100 సైకిళ్లను మేదరమెట్ల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు అందజేయడానికి యుద్ధ ప్రాతిపదికన సిద్ధం చేయిస్తున్నారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతంతో పాటు



వారి సంఖ్యను కూడా పెంచేందుకు మంత్రి గొట్టిపాటి ఎనలేని కృషి చేస్తున్నారు.

### బాలికల నుంచి బాలురు వరకు....

ఇంటి నుంచి స్కూళ్లకు కొంచెం దూరం కావడంతో అద్దంకి బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన కొందరు విద్యార్థినులు తరగతులకు గైర్హాజరవుతున్నారని స్థానికులు కొందరు మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకొచ్చారు. గ్రీవెన్స్ లో తన దృష్టికి వచ్చిన ఈ అంశంపై మంత్రి గొట్టిపాటి ప్రత్యేక దృష్టి సారించారు. పాఠశాలకు దూరంగా ఉన్న వారి జాబితాను అప్పటికప్పుడే సిద్ధం చేయించి 9, 10 తరగతులు చదువుతున్న554 మంది బాలికలకు సీఎస్ఆర్ నిధులతో సైకిళ్లను సమకూర్చారు. అద్దంకిలో జరిగిన ఉచిత సైకిళ్ల పంపిణీ విషయం నియోజకవర్గం మొత్తం తెలియడంతో తమకు కూడా అవసరం ఉంది కావాలంటూ... పలువురు విద్యార్థినీ, విద్యార్థులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. దీనితో అద్దంకి నియోజకవర్గ పరిధిలో ఉన్న ఉన్నత పాఠశాల బాల, బాలికల్లో అవసరం అయిన వారికి సైకిళ్లను అందించాలని ఆయన నిర్ణయించారు. సుమారుగా 10,000 సైకిళ్లు అవసరం అవుతాయని అంచనాలు రూపొందించారు. రెండో విడతగా బాల, బాలికలిద్దరికీ 1100 సైకిళ్లను జులై



నెలలోనే పంపిణీ చేయడానికి శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

### పెరిగిన హాజరు శాతం....

అద్దంకి నియోజకవర్గ పరిధిలో మంత్రి గొట్టిపాటి చేపట్టిన విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమం సత్ఫలితాలను ఇచ్చిందని పలువురు తల్లిదండ్రులతో పాటు అధికారులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. అద్దంకి బాలికల ఉన్నత పాఠశాలలో... గతంలో కంటే మిన్నగా హాజరు శాతం పెరిగిందని వారు పేర్కొంటున్నారు. సైకిల్ అందుబాటులోకి రావడంతో విద్యార్థులు కూడా పాఠశాలలకు రావడానికి ఉత్సాహం చూపుతున్నారంటున్నారు. తల్లికి వందనం జమ కావడం, గతంలో కంటే నాణ్యమైన యూనిఫార్మ్ లు, పుస్తకాలు అంద చేయడంతో పాటు మధ్యాహ్న భోజన పథకం విషయం, సంక్షేమ పాఠశాలల్లో మౌలిక వసతులు అభివృద్ధి వంటి వాటిలో... మంత్రి గొట్టిపాటి స్వయంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు మంత్రి లోకేష్ తీసుకొచ్చిన సంస్కరణలు కూడా సత్ఫలితాలను ఇచ్చాయని చెబుతున్నారు.

# పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రకటించాలి



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 5)

ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై కొంతకాలంగా పరిష్కారం కానీ సమస్యల పరిష్కారం కోసం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ చేపట్టిన ఉద్యమంలో భాగంగా శనివారం ఉద్యోగులందరూ ఎర్రబ్యాడ్జీలు ధరించి రెండవ రోజు పొదిలి డిపో నందు గేట్ మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ ధర్నానీ ఉద్దేశించి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానంలో భాగంగా వారం రోజుల్లో ఐఆర్ ప్రకటిస్తామని ఇప్పటివరకు ప్రకటించలేదని, అంతేగాక పెండింగ్ లో ఉన్న నాలుగు డి ఎ లను వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 11వ పిఆర్సి అరియర్స్ ను 24 నెలలు సంబంధించిన కాలానికి త్వరితగతిన విడుదల చేయాలని కోరడం జరిగిందన్నారు. 12వ పిఆర్సి కమిషన్ను వెంటనే నియమించాలని డిమాండ్ చేసి ఉన్నారు ప్రభుత్వం తలపెట్టిన సూపర్ సిక్స్ లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యవంతంగా నిర్వహించాలంటే 300 బస్సులు అవసరమని అంతేకాకుండా పదివేల మంది సిబ్బంది అవసరం అవుతుందని వెంటనే రిక్రూట్మెంట్ చేపట్టాలని, కొత్త బస్సులను కొనాలని కోరారు. యాజమాన్యం తలపెట్టిన ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు ప్రభుత్వం సహాయంతో కొనుగోలు చేసి ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ ద్వారానే ఆర్టీసీ సిబ్బంది చే నిర్వహించాలని కోరినారు ఉద్యోగులకు పాత పద్ధతిలోనే రిఫరల్ హాస్పిటల్లో వైద్య సౌకర్యం కల్పించాలని కోరి ఉన్నారు ఎక్సెస్ పేరుతో పొదిలి డిపో నుండి ఇతర డిపోలలో గత ఆరేళ్లుగా పనిచేస్తున్న వారిని వెంటనే మాతృ డిపోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఏ దివాకర్, డిపో సెక్రటరీ ఓబులేష్, ట్రెజరర్ ఎస్కె జిలాని, గ్యారేజ్ సెక్రటరీ సుబ్బారావు, మహిళా ఉద్యోగులు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొని ఈ ధర్నాని విజయవంతం చేశారు.

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం

# పవన్ కళ్యాణ్ సభ సూపర్ హిట్

### నేతల కార్యచతురతకు అభినందనలు
### పవన్‌కు అభిమానం... నేతలకు అభినందన
### కందుల, ఇమ్మడిలు కష్ట పడ్డారు- విజయం సాధించారు



**(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, జులై 5)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ మార్కాపురం నియోజకవర్గంలో శుక్రవారం చరిత్రాత్మకంగా నిలిచే ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. రూ.1290 కోట్ల వ్యయంతో జల జీవన్ మిషన్ కింద మార్కాపురం, కనిగిరి, దర్శి, గిద్దలూరు, యర్రగొండపాలెం నియోజకవర్గాలకు శాశ్వతంగా తాగునీరు అందించే అత్యంత భారీ పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమం రాజకీయంగా, పరిపాలనా పరంగా, సాంకేతికంగా అపూర్వంగా నిలిచింది. ఇందుకు ప్రధాన కారణం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ ఇమ్మడి కాశీనాధులు అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వయంగా ప్రకటించారు. హెలికాప్టర్ దిగిన చోట నుంచీ, సభ ముగిసే వరకూ చిన్న విషయాల వరకూ ప్రతి అంశాన్ని సమీక్షిస్తూ, వ్యవస్థితంగా నిర్వహించారు. రాజకీయ నాయకుల ఆహ్వానం, అధికారుల సమన్వయం, వేదిక ఏర్పాట్లు, వక్తల ప్రాధాన్యత క్రమం ఇలా అన్నింటినీ సమర్థవంతంగా నడిపించారు. ఒక సందర్భంలో కొణిదెల పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ మీకు మంచి నేతలు దొరికారు. కందుల నారాయణరెడ్డి, ఇమ్మడి కాశీనాథ్ ఎంతో నిష్టతో పని చేశారు. నేను తిరిగి ఈ ప్రాంతానికి వస్తాను. మరింత సమీక్షించేందుకు మీ అందరినీ కలిసే మాట్లాడతాను. మళ్లీ సమావేశం అవ్వాలి అని హర్షం వ్యక్తం చేశారు. అంతే కాదు సభ అనంతరం ఉప ముఖ్యమంత్రి స్వయంగా నారాయణరెడ్డికి, కాశీనాథ్‌లకు అభినందనలు తెలిపి వారి భుజాలపై చెయ్యి వేసి అభినందించారు. "ఇద్దరూ ఇద్దరే... కానీ పూర్తి సభను చక్కగా చక్కదిద్దారు." అంటూ ప్రశంసలు కురిపించారు. ఈ సభకు జిల్లాలోని ప్రముఖ రాజకీయ నాయకులు, అధికారులు హాజరై దీన్ని ఘనవిజయం చేశారు. సభ అంచనాలను మించి ప్రజల స్నేహంతో, నాయకుల సున్నితమైన పర్యవేక్షణతో రెండు రెట్లు విజయవంతం కావడం గర్వించదగిన విషయం. కార్యక్రమానంతరం నారాయణరెడ్డి, కాశీనాథ్‌లు కలిసి పవన్ కళ్యాణ్ ని ఘనంగా సన్మానించారు. ఇది రాజకీయంగా పవన్ కళ్యాణ్‌కి, జనసేన పార్టీకి, ప్రత్యేకించి మార్కాపురం ప్రాంతానికి ఎంతో విశిష్టతను తీసుకొచ్చింది.

**రాష్ట్రానికి మార్గనిర్దేశం చేసే సభ**

ఈ సభ ద్వారా మార్కాపురం నియోజకవర్గానికి మాత్రమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పారదర్శక పాలనకు, ప్రజలకు ఉపయోగపడే విధానాల అమలుకు, నాయకత్వ సమర్థతకు దిశానిర్దేశం కలిగింది. ఇది సభ కాదు. ప్రజాస్వామ్య పండుగ. ఈ సభలో కేవలం నినాదాలు వినిపించలేదు... జన సంకల్పానికి ప్రతిధ్వని మిన్నంగా వినిపించింది. ప్రజల అభిప్రాయాలకు నాయకుల స్పందన, కార్యాచరణలోనూ ప్రతిఫలించింది. ఈ సందర్భంగా రెండు ప్రధాన నేతలు నారాయణరెడ్డి, కాశీనాథ్ లు తమ నేతృత్వ నైపుణ్యాన్ని మరోసారి నిరూపించుకున్నారు. ఇంతటి ఘన విజయానికి శ్రేయస్సు ఇద్దరు నేతలే. సభ విజేతలు ఆ ఇద్దరే. పవన్ కళ్యాణ్ సభ రాష్ట్రంలో చరిత్రకు చిరునామా. నాయకత్వం, నిబద్ధత, నిర్వాహక నైపుణ్యం ఇవే విజయ చిహ్నాలు. ఇది కేవలం సభ కాదు. సంకల్పానికి, సమన్వయానికి, సమర్థతకు ప్రతిరూపం. సభ విజేతలు కందుల నారాయణరెడ్డి, ఇమ్మడి కాశీనాథ్‌లే...!

# మహిళలకు ప్రభుత్వం అండ

### ఇన్‌ఛార్జి కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 5)**

మహిళలు అన్ని రంగాల్లోనూ ముందడుగు వేసేలా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉందని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ చెప్పారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) లోని రిసోర్స్ పర్సన్స్ (ఆర్.పీ)కు 164 ట్యాబులు, డిజీ లక్ష్మిలకు 100 బయోమెట్రిక్ పరికరాలను శనివారం ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో పంపిణీ చేశారు. మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ పి శ్రీహరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, ఆస్టర్ రమేష్ ఆసుపత్రి ఒంగోలు బ్రాంచ్ సీఈవో డాక్టర్ అల్లూరి నితిన్, గైనకాలజీ డాక్టర్ ప్రతిమ పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్లు తమ గ్రూపులకు సంబంధించిన వివరాలు, లావాదేవీలను పుస్తకాలలో కాకుండా నేరుగా ఈ ట్యాబ్ లలో నమోదు చేయాల్సి ఉంటుందని మెప్మా పీ.డి. చెప్పారు. తద్వారా ఆ వివరాలు ముఖ్యమంత్రి డాష్ బోర్డుకు అనుసంధానం అవుతాయన్నారు.



# కనిగిరి టీడీపీలో కసరత్తు

### మండల పార్టీ అధ్యక్షుల ఎంపిక పై సమాలోచనలు
### అందరు అధ్యక్షుల మార్పు తథ్యమా?

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 5)**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ మండల పార్టీ అధ్యక్షుల పదవులకు ప్రాధాన్యత పెరిగింది. ప్రస్తుత అధ్యక్షుల స్థానంలో కొత్త వారిని నియమించేందుకు టీడీపీ అధిష్టానం కసరత్తు చేస్తుంది. మొదట్లో రెండు, మూడు మండలాల అధ్యక్షుల మార్పు ఉంటుందని టీడీపీ శ్రేణుల్లో ప్రచారం సాగింది. కానీ ప్రస్తుతం కనిగిరి పట్టణ అధ్యక్షుడితో పాటు ఆరు మండలాల పార్టీ అధ్యక్షులను మార్చేందుకు కసరత్తు చేస్తున్నారు. కనిగిరి పట్టణ అధ్యక్షునిగా ఆర్యవైశ్య వర్గంలో బలమైన వారిని అధ్యక్షునిగా ఉంచాలని పార్టీ ఆలోచించింది. అయితే ఆర్యవైశ్యుల్లో మంచిపేరున్న నాయకులు పదవి తీసుకునేందుకు సుముఖత చూపనట్లు సమాచారం. దాంతో తెలుగు యువత అధ్యక్షుడిగా ఉన్న షేక్ ఫిరోజ్‌ను పట్టణ అధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. కనిగిరి రూరల్ మండలంలో గుడిపాడుకు చెందిన కొండా కృష్ణారెడ్డి పేరు దాదాపు ఖరారు అయినట్లు టీడీపీ నాయకులు అంటున్నారు. పామూరు మండల పార్టీ అధ్యక్షులుగా స్వర్గీయ బొల్లా మాల్యాద్రి చౌదరి కుమారుడు బొల్లా నరసింహారావు ను నియమించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది. పామూరు పార్టీ అధ్యక్షులు పువ్వాడ వెంకటేశ్వర్లును కొనసాగించాలని ఉన్నా అన్ని మండలాల అధ్యక్షులను మారుస్తున్న తరుణంలో పామూరు



# ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలి

### నియోజకవర్గంలో కొత్త బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి
### అధికారులకు మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఆదేశం



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జులై 5)**

బాపట్ల జిల్లా జిడిపిలో ప్రతి ఏటా 15 శాతం వృద్ధిరేటు పెరిగేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి, సమాచార పౌర సంబంధాల, గృహ నిర్మాణశాఖల మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. బాపట్ల జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ పై శనివారం స్థానిక కలెక్టరేట్లో సమీక్ష జరిగింది. జిల్లా ఇన్చార్జి మంత్రి వర్చువల్ విధానంలో హాజరయ్యారు. బాపట్ల జిల్లా అన్ని రంగాలలో వృద్ధి సాధించాలంటే అందుబాటులో ఉండే వనరులను సద్వినియోగం చేసుకోవాలని ఇంచార్జి మంత్రి చెప్పారు. అధికారులంతా సమగ్ర ప్రణాళిక రూపొందించుకుని చిత్తశుద్ధితో పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు ప్రణాళికలకు రూపొందించి ఛాలెంజ్ గా పనిచేయాలన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుపుచ్చుకుని మూడు పంటల విధానం అమలు చేయాలన్నారు. ప్రస్తుతం

# జిడిపిలో ప్రతి ఏటా 15 శాతం వృద్ధిరేటు పెరిగేలా చూడాలి

### జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి

బాపట్ల జిల్లా జిడిపిలో 20వ స్థానం లో నిలిచిందని, ప్రతి ఏటా వృద్ధిరేటు 15 శాతం లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ దిశగా పనిచేయాలన్నారు. వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం పూర్తిగా తగ్గించాలన్నారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి, ఉద్యాన పంటలలో కొత్త రకాలను ప్రోత్సహించడంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. పామాయిల్ సాగుపై రైతులు



దృష్టి సాధించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. భూమి, వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, వాటికి అనువుగా ఉండే పంటలను ప్రోత్సహిస్తూ విత్తనాలు పంపిణీ చేయాలన్నారు. తద్వారా ఉత్పత్తులు పెరిగితే ఆదాయం మెరుగుపడే అవకాశం ఉందన్నారు. బ్లాక్ బర్లీ పొగాకు రైతుల పరిస్థితి పునరావృతం గాకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్ళించాలన్నారు. ఆక్వా రంగంలోనూ లాభసాటి సాగు జరిగేలా రైతులకు సూచనలు ఇవ్వాలన్నారు. నీటి సంఘాలకు ఆక్వా సాగు కేటాయించి అంశాలపై ఆలోచనలు చేయాలన్నారు. బాపట్ల జిల్లాలో భారీ పరిశ్రమ స్థాపనకు పెట్టుబడిదారులను ఆహ్వానించాలన్నారు. ప్రతి ఇంటి నుంచి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను తయారు చేయడం లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. సమాజంలో డిమాండ్ కు తగినట్టుగా గొర్రెలు, మేకలు, కోళ్ల ఫారమ్ పెంచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. చేతివృత్తులను ప్రోత్సహించడం, సూక్ష్మ, మధ్య, చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు ఆర్థిక చేయూతనందించాలన్నారు. పర్యాటకం పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన పలు సూచనలు చేశారు. ప్రజల తలసరి ఆదాయం పెంచడమే లక్ష్యంగా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో ప్రజల తలసరి ఆదాయం రూ.2.19 లక్షలు కాగా, ఏడాదికి 15 శాతం పెంచేలా ప్రణాళిక రూపొందించామన్నారు. 2028-29 సంవత్సరానికి జిల్లా తలసరి ఆదాయం రూ.5.42లక్షల (తరువాయి 4లో...)

## తొలి ఏకాదశి శుభాకాంక్షలు ఒంగోలు ఎంపీ మాగుంట



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 5)

హిందువుల తొలి పండుగగా ఖ్యాతిచెందిన తొలి ఏకాదశి పండుగకు ప్రత్యేక స్థానమున్నది. సంవత్సరంలో వచ్చే 24 ఏకాదసులలో ఆషాడ శుద్ధ ఏకాదశినాటి నుండి శ్రీ మహా విష్ణువు నాలుగు నెలలపాటు యోగ నిద్రకై క్షీర సాగరంలో శేషతల్పంపై శయనిస్తాడు. ఈ రోజున ఉపవాసం వుండి, జాగరణ చేసి, శ్రీ మహా విష్ణువును పూజించినచో విశేష ఫలితాలు మనకు కలుగుతాయని పురాణాలు తెలియజేస్తూన్నాయి. కనుక, జిల్లా ప్రజలందరూ తొలి ఏకాదశి రోజున ఉపవాసం వుండి, జాగరణ చేసి, శ్రీ మహా విష్ణువును పూజించి విశేష ఫలితాలు పొందవల్సిందిగా కోరుతూ తొలి ఏకాదశి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## కంభం రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన కంభం ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్, ఎన్ఫోర్స్మెంట్ సీఐ ఒంగోలు, రైల్వే సిబ్బంది 4.7 లీటర్ల గోవా మద్యం సీజ్



(షణ్ముఖ వెలుగు, కంభం, జులై 5)

ప్రకాశం జిల్లా ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు ఎన్ఫోర్స్మెంట్ సీఐ, సిబ్బంది, మార్కాపురం ఏ ఈ ఎస్ టీ ఎఫ్ సిబ్బంది, కంభం సిఐ, సిబ్బంది , కంభం ఆర్పిఎఫ్ సహాయంతో ఉదయం కంభం రైల్వే స్టేషన్ నందు తనిఖీలు నిర్వహించగా ఒక బ్యాగ్ యందు 4.7 లీటర్ల గోవా లిక్కర్ కలుగరడం జరిగింది. సదరు వ్యక్తి పారిపోవడం జరిగింది. సదరు వ్యక్తిని తదుపరి ఇన్వెస్టిగేషన్లో కనుగొన్నారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ కొండారెడ్డి మాట్లాడుతూ ఎవరైనా ఇతర రాష్ట్రాల మద్యంను, నాటు సారాయి, బెల్ట్ షాపులు నిర్వహించినా, అక్రమంగా ఇతర రాష్ట్రాల మద్యం తరలించినా, అక్రమంగా మద్యం కలిగి ఉన్నా, అమ్మినా ప్రోహిబిషన్, ఎక్సైజ్ వారికి వెంటనే సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు.

## మొహరం పండుగ ఉత్సవాల్లో హత్య మృతుడు గతంలో సర్పంచ్ భర్తను హతమార్చిన కేసులో నిందితుడు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 5)

దోర్నాల మండలంలోని నల్ల కుంట్ల గ్రామంలో మొహరం పండుగ ఉత్సవాల్లో హత్య జరిగిన సంఘటన చోటు చేసుకుంది. మూడు సంవత్సరాల క్రితం సర్పంచి ముద్దు రవణమ్మ భర్త ముద్దు వెంకటేశ్వర్లును చంపిన భైరవబోయిన వెంకటేశ్వర్లుగా గుర్తించారు. ఆ హత్య కేసులో ప్రధాన నిందితుడైన భైరబోయిన వెంకటేశ్వర్లు రాత్రి మొహరం పండుగ గ్రామ ఉత్సవం జరుగుతుండగా కాపు కాచిన సర్పంచి ముద్దు రమణమ్మ అనుచరులు భైరవబోయిన వెంకటేశ్వర్లు పై వేట కొడవళ్లతో దాడి చేసి సర్పంచి రమణమ్మ అనుచరులు నరికి చంపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేస్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జాయింట్ సెక్రటరీగా నియమించినందుకు ధన్యవాదాలు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 5)

వైసీపీలో తన సేవలు గుర్తించి కందుకూరు నియోజకవర్గ వైసీపీ బుర్రా మధుసూదన్ యాదవ్, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తనను వైఎస్ఆర్సిపి స్టేట్ జాయింట్ సెక్రటరీగా నియమించినందుకు నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నానని వెలిచెర్ల ధనకోటి ఒక ప్రకటనలో తెలిపారు.

# మహిళలకు ప్రభుత్వం అండ







**రాష్ట్రంలోనే తొలిసారిగా...**

ఆస్టర్ రమేష్ యాజమాన్యం, మెప్మా మధ్య ఈ కార్యక్రమంలో ఒక ప్రత్యేక అవగాహన ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం మెప్మా మహిళలకు అన్ని మున్సిపాలిటీలలో ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాలను ఆస్టర్ రమేష్ ఆసుపత్రి వైద్యులు నిర్వహిస్తారు. చికిత్స అవసరమైన వారికి ఆయా కేసులను బట్టి 20 శాతం వరకు ఫీజులో రాయితీ ఇస్తారు. మెప్మా మహిళల కుటుంబ సభ్యులు చదువుకున్నట్లయితే వారి అర్హతను బట్టి తమ ఆసుపత్రిలో ఉద్యోగ అవకాశాలను కూడా కల్పిస్తారు. రాష్ట్రంలోనే తొలిసారిగా ప్రకాశం జిల్లాలో ఒక ప్రైవేటు ఆసుపత్రితో ఈ తరహా ఒప్పందం జరిగింది.

**మా అమ్మ కూడా ఎస్‌హెచ్‌జి లీడర్...**

ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కలెక్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ తన తల్లి కూడా స్వయం సహాయక సంఘ (ఎస్‌హెచ్‌జి) లీడర్ అని చెప్పారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగానూ సాధికారత సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం 20 ఏళ్ల క్రితమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకున్నారని ఆయన గుర్తు చేశారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మహిళలు అన్ని రంగాల్లోనూ ముందడుగు వేసేలా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటున్నట్లు తెలిపారు.

**గౌరవము ... గుర్తింపు...**

మహిళలకు గౌరవంతో పాటు ప్రత్యేక గుర్తింపు కూడా ఉండాలన్నది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు చెప్పారు. ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా



ఉన్నప్పుడే మహిళలకు ఆస్తిలో వాటా వచ్చేలా చర్యలు తీసుకున్నట్లు గుర్తు చేశారు. అనంతరం మహిళల ఆర్థిక స్వావలంబన కోసం నారా చంద్రబాబు నాయుడు కృషి చేశారని చెప్పారు. ఆయన కృషికి నిదర్శనమే నేడు స్వయం సహాయక సంఘాల మహిళల విజయాలు అని వ్యాఖ్యానించారు. ఎస్ హెచ్ జి మహిళలు 10 మందికి ఉపయోగపడేలా ఉండాలని, జిల్లాను అన్ని రంగాల్లోనూ ముందుకు తీసుకువెళ్లాలని ఆయన సూచించారు. తద్వారా సమాజంలో ఎస్ హెచ్ జి మహిళకు గౌరవం పెరుగుతుందన్నారు. పీ -4 పథకం కింద లబ్ధి పొందేందుకు ఒంగోలు నియోజకవర్గంలో 10,700 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు చెప్పారు. ఆయా కుటుంబాలు అన్ని విధాల అభివృద్ధి చెందేలా మెప్మా ఆర్పీలు తమ వంతు సహకారం అందించాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా పనిచేయాలని ఎమ్మెల్యే చెప్పారు. విద్యార్థులు దుర్వ్యసనాలకు బానిసలు కాకుండా చదువుకునేలా విద్యా వ్యవస్థలో పలు మార్పులు తీసుకువచ్చి రాష్ట్ర ప్రభుత్వం బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. నూతన యూనిఫారం, మెరుగ్గా తల్లికి వందనం, నాణ్యమైన భోజనం వంటివి ఇందులో భాగమేనని తెలిపారు. ఆయా బంగారు కుటుంబాలకు ప్రభుత్వం తరపునుంచి, అదేవిధంగా మార్గదర్శకుల నుంచి కూడా అందే అవకాశం ఉన్న సహాయాన్ని వివరించాలని అన్నారు. ఒక్కొక్కటి సుమారు 30 వేల రూపాయల విలువైన ట్యాబ్ ను ఆర్పీలకు ప్రభుత్వం అందిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా డిగ్రీ విద్యార్హత కలిగిన డిజి లక్ష్మి లకు కూడా కామన్ సర్వీస్ సెంటర్లు (సిఎస్‌సి)లు మాదిరిగా సేవలు అందిస్తూ మరింత ఆదాయం పొందేలా బయోమెట్రిక్ పరికరాలను కూడా ఇస్తున్నామన్నారు. టెక్నాలజీని అందిపుచ్చుకొని పనిచేయాలని ఆర్. పి. లకు ఆయన పిలుపునిచ్చారు. ఎలాంటి సహకారం కావాలన్నా వ్యక్తిగతంగా తాను అండగా ఉంటానని, ప్రభుత్వం నుంచి కూడా అవసరమైన సహాయం అందేలా చూస్తానని మెప్మాకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. డాక్టర్ అల్లూరి నితిన్ మాట్లాడుతూ తమ ఆసుపత్రి ద్వారా అందించే వైద్య సదుపాయాలను, రాయితీల వివరాలను వెల్లడించారు. ఆరోగ్యం పట్ల, ముఖ్యంగా మహిళలకు వచ్చే సమస్యల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తల గురించి డాక్టర్ ప్రతిమ ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఐబి ఫణి కుమారి, బిఎల్ రాణి, ఏవో వినీల్ కుమార్, మెప్మా జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు భారతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కనిగిరి టీడీపీలో కసరత్తు

పార్టీ అధ్యక్షులుగా బొల్లా నరసింహారావుకు అవకాశం ఇవ్వాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం. వెలిగండ్ల మండలంలో కొట్టాలపల్లికి చెందిన రియల్టర్ కొండు భాస్కర్‌రెడ్డిని ఆ మండల పార్టీ అధ్యక్షులుగా ఎంపిక చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అయితే నియోజకవర్గ రైతు అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి కూడా పార్టీ అధ్యక్ష పదవి ఆశిస్తున్నాడు. సిఎస్‌పురం మండల పార్టీ అధ్యక్షులుగా సిఎస్‌పురం కు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు , కాపు సామాజిక వర్గానికి చెందిన బొబ్బూరి రమేష్ పేరు ముందంజలో ఉంది. హెచ్‌ఎంపాడు మండలంలో గ్రూపుల పోరు ఎమ్మెల్యే ఉగ్రకు తలనొప్పిగా మారింది. సొంత మండలం కావడంతో కరవమంటే కప్పకు కోపం...విడవ మంటే పాముకు కోపం అన్న చందంగా గ్రూపులను సమన్వయం చేయలేక మధ్యే మార్గంగా రిటైర్డ్ ఉపాధ్యాయుడు కోటపాటి శేషయ్యను పార్టీ అధ్యక్షుడిగా నియమిస్తానని ఎమ్మెల్యే నాయకులతో అన్నట్లు తెలుస్తుంది. కానీ అక్కడ అధ్యక్ష ఎంపిక నియామకం జరిగే వరకు చెప్పలేని పరిస్థితి. పీసీపల్లి మండల పార్టీ అధ్యక్షులుగా పెద అలవలపాడుకు చెందిన అందరివాడిగా ఉన్న పువ్వాడి నాగరాజు పేరు దాదాపు ఖరారు అయినట్లు తెలుస్తుంది. ఆర్థిక, అంగ బలంతో పాటు అందరిని కలుపుకుని పోయే తత్వం ఉండడంతో ఆయన ఎంపిక ఖాయమని చెప్పవచ్చు. నాగరాజు నియామకంతో పార్టీకి దూరంగా ఉన్న సీనియర్ నాయకులు కూడా పార్టీ అభివృద్ధికి కృషి చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కానీ ఎమ్మెల్యే ఉగ్ర మాత్రం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కొత్త అధ్యక్షుల పై తీవ్ర కసరత్తు చేస్తున్నారు. 90 శాతానికి పైగా సర్పంచ్‌లు, ఎంపిటిసిలను గెలిపించి తన సత్తా చాటుకునేందుకు సరైన వారిని నూతన అధ్యక్షులుగా నియమించేందుకు 10 రోజులుగా కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే అన్ని మండలాలల్లోని గ్రామాల నాయకుల అభిప్రాయాలు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు గ్రామాల్లో గ్రూపుల గోల ఉన్న తరుణంలో గ్రూపులకు ఫుల్‌స్టాప్ పెట్టే నూతన అధ్యక్షులను ఎంపిక చేయడమే లక్ష్యంగా ఎమ్మెల్యే పని చేస్తున్నారు. నూతన అధ్యక్షుల నియామకం పూర్తయిన తర్వాత పార్టీ కార్యక్రమాలతో పాటు ప్రభుత్వ చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్ళేందుకు ఎమ్మెల్యే ఉగ్ర ప్రణాళికలు రచించుకుంటున్నారు.

## ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలి

(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, జులై 5)

కొండపి నియోజకవర్గంలో నూతన బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఆదేశించారు. శనివారం నాడు ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో కొండపి నియోజకవర్గ పంచాయతీ రాజ్, ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులతో విడివిడిగా మంత్రి డాక్టర్ స్వామి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో త్రాగునీరు, పారిశుధ్యం, రహదారులు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. అవసరమైన చోట కొత్తగా బోర్లు వేయించాలన్నారు. రామతీర్థం నుంచి మర్రిపూడి మండలంలోని పలు గ్రామాలకు త్రాగునీటి సరఫరాపై అధికారులతో మంత్రి సుదీర్ఘంగా



చర్చించారు. గ్రామాల్లో పరిశుభ్రత పారిశుద్ధ్యనికి పెద్ద పీట వేయాలని డయేరియా ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో నూతన బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు.

## జిడిపిలో ప్రతి ఏటా 15 శాతం వృద్ధిరేటు పెరిగేలా చూడాలి



సాధించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. ప్రైమరీ సెక్టార్ లో జిడిపి వృద్ధి రూ.40,649 కోట్లు ఉందన్నారు. ప్రస్తుతం 58 శాతం వృద్ధి రేటు ఉండగా, ఏడాదికి 15శాతం పెంచుతూ ముందుకు వెళ్లేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. 2028-29 సంవత్సరానికి జిడిపి రూ.84 వేల కోట్లకు పెంచుతామన్నారు. ప్రైమరీ, సెకండరీ, సర్వీస్ సెంటర్లలో వృద్ధిరేటు పెరగడానికి సృజనాత్మకతతో అధికారులు పనిచేయాలని మార్గనిర్దేశం చేశారు. గడిచిన ఏడాదిలో బాపట్ల జిల్లాలో వస్తువుల అంతిమ ఉత్పత్తి విలువ రూ.20,163 కోట్లు కాగా, 2028-29 సంవత్సరానికి రూ.38,165 కోట్లు పెరగాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మాదిరిగా కే పి ఐ సి లక్ష్యంతో అధికారులు అడుగులు ముందుకు సాగాలన్నారు. వ్యవసాయం, ఉద్యానవన, ఆక్వా రంగాలతోపాటు పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేలా సమగ్ర ప్రణాళికలు రూపొందించామన్నారు. నియోజకవర్గ స్థాయిలో విజన్ యాక్షన్ ప్లాన్ రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వ శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి నియోజకవర్గంలో శాసనసభ్యులు ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టి కృషితోనే వృద్ధి సాధ్యమని వివరించారు. పి4 కుటుంబాలకు మార్గదర్శిలను అనుసంధానించే ప్రక్రియ ఇప్పటికే 72% పూర్తయిందని, మిగిలిన 28% త్వరలో పూర్తి చేస్తామన్నారు. 15 ఎస్టీ కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు వివరించారు. వారి అభ్యున్నతికి కృషిచేయాలన్నారు. అధికారులంతా మానవత్వంతో పనిచేస్తేనే మంచి ఫలితాలు లభిస్తాయని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ చెప్పారు. సుపరిపాలన తొలి అడుగులో పేదల ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు వెళ్తున్నామన్నారు. రెండు కుటుంబాలను దత్తత తీసుకొని వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ప్రజా ప్రభుత్వంలో నియోజకవర్గ స్థాయిలో కార్యాలయాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పి4 విధానంలో కొత్త వరవడికి రాష్ట్ర ప్రభుత్వం నాంది పలికిందన్నారు. విజన్ బాపట్ల ప్రణాళికకు చిత్తశుద్ధితో అధికారులు పనిచేయాలని వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు తెలిపారు. జిడిపి పెంచడమే లక్ష్యంతో అధికారులు పనిచేయాలన్నారు. అధికారుల సమష్టి కృషి అవసరమన్నారు. ఇతర జిల్లాలను పోటీగా తీసుకుని సమర్థంగా పనిచేయాలని సూచించారు. పి4 విధానంలో పేద కుటుంబాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని చీరాల శాసనస సభ్యులు ఎం మాలకొండయ్య తెలిపారు. పి4 అమలులో బాపట్ల జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచనలకు తగినట్టుగా జిల్లా కలెక్టర్ సమర్థంగా పని చేయడం, జిల్లాను ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యేలకు ప్రత్యేక కార్యాలయాలను ప్రభుత్వం ఏర్పాటు చేయడం సంతోష దాయకమన్నారు. కార్యక్రమంలో సిపిఓ షాలేమ్ రాజు, జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ హత్య కేసుల్లో రిపోర్టులు పంపని తహసీల్దార్ల పై కేసులు నమోదు చేయాలి

## ఇన్ఛార్జి కలెక్టర్‌కు దళిత నేత నీలం ఫిర్యాదు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 5)

జిల్లాలో జరిగిన ఎస్సీ ఎస్టీ హత్య బలవన్ మరణం కేసుల్లో బాధితుల రిలీఫ్ కొరకు రిపోర్టులు పంపని 13 మంది తహసీల్దార్ లపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేయాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గోపాలకృష్ణకు శనివారం దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు ఫిర్యాదు చేశారు. జిల్లాలో చాలా కాలంగా ఎస్సీ ఎస్టీ హత్య మరియు బలవన్ మరణం కేసుల్లో సంబంధిత తహసిల్దార్లు కుటుంబ సభ్యుల వివరాలు ఉద్యోగం, పెన్షన్, రిలీఫ్ ఎవరికి ఇవ్వాలనే విషయంపై రిపోర్టులు పంపడం లేదన్నారు. తహసీల్దార్ల అలసత్వం వలన విధినిర్వహణలో నిర్లక్ష్యం వలన ఎస్సీ ఎస్టీ హత్య కేసు బాధితులకు రెండు నెలల్లో ఇవ్వవలసిన రిలీఫ్ పోలీస్ రిపోర్టులు వచ్చిన మంజూరు కావడం లేదన్నారు. కలెక్టరేట్ నుండి రిపోర్టులు పంపమని సంబంధిత తహసిల్దారులకు రిమాండర్ పంపించిన తాసిల్దార్లు లెక్కచేయడం లేదన్నారు. అందువలన కుటుంబ జీవనాధారం కోల్పోయిన భార్యలకు ఎస్సీ ఎస్టీ మంత్రి పెన్షన్ కూడా మంజూరు కావడం లేదన్నారు. నాగులుప్పలపాడు మండలం కేశి వారి పాలయానికి చెందిన మొల తోటి వెంకట్రావు అనే దళితుడు 2023 వ సంవత్సరంలో ఒంగోలు నారాచి రెస్టారెంట్ లో మొల తోటి వెంకట్రావు అను దళితుడు హత్యకు గురయ్యాడు. ఈ ఘటనలో నాగులుప్పలపాడు తాసిల్దారు రిపోర్టు పంపనందున భార్య మాధవికి ఎస్సీ, ఎస్టీ మంత్లీ పెన్షన్ మరియు కుమారుడికి ఉద్యోగం రాలేదన్నారు. గత సంవత్సరం ఏప్రిల్ ఒకటవ తేదీన కలెక్టరేట్ నుండి నాగులప్పలపాడు తహసిల్దార్ కు ఒంగోలు ఆర్డీవో ద్వారా రిపోర్టు కొరకు రిమాండర్ పెట్టిన 16 నెలలైనా తాసిల్దారు ఇంతవరకు రిపోర్ట్ పంపకపోవడం ఎస్సీ ఎస్టీ బాధిత కుటుంబానికి ఉద్దేశపూర్వకంగా ఆర్థికంగా అంటరానితనం పాటించడమేనన్నారు. అలాగే దర్శి మండలం పోతవరం గ్రామంలో కోట పేరయ్య అనే వ్యక్తి 2015లో ఇతర కులాలచే అవమానించబడి బలవన్ మరణం చెందితే కోర్రెల మీద కొర్రీలు వేస్తూ కలెక్టరేటివ్ రెవెన్యూ అధికారులు సంబంధిత దర్శి తహసిల్దారూ చనిపోయిన కోటయ్య కుటుంబంతో చదరంగం ఆట ఆడుతున్నారన్నారు. అలాగే ఎర్రగొండ పాలానికి చెందిన తూమాటి చెన్నమ్మ దళిత మహిళ హత్య కేసులో ఇద్దరు కుమారులకు పెన్షన్ డిగ్రీ చదివిన మనవరాలుకి ఉద్యోగం కొరకు ప్రతిపాదన పంపమని కలెక్టరేట్ వారు ఆదేశించిన ఎర్రగొండపాలెం తాసిల్దార్ రిపోర్టు పంపకుండా అగ్రకుల ఫ్యూడలిజం ప్రదర్శిస్తున్నారు అన్నారు. అర్ధవీడు మండలంలో పల్లా వద్దు సురేష్ నాయక్ ను కుట్ర పూర్వకంగా కరెంటు షాక్ తో ఇతర కులాల వారు చంపితే బాధిత కుటుంబ సభ్యులకు రిలీఫ్ ఇవ్వటానికి అర్ధవీడు తహసిల్దారు రిపోర్టు పంపకుండా వేధిస్తున్నాడన్నారు. కొంతమంది తహసిల్దారు ఆఫీసుల్లో రిపోర్టులు పంపటానికి వీఆర్వోలు ఆర్ఐలు బాధితులని పర్సంటేజీలు అడుగుతున్నాడన్నారు. చాలామంది తహసిల్దార్లు పంపకుండా రిపోర్టులు పంపకుండా ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికేట్ పంపిస్తున్నాడు. విచారణ పేరుతో ఆఫీసులో చుట్టూ బాధితుల్ని తిప్పుతూ నరకం చూపిస్తున్నారన్నారు. పోస్టుమార్టం రిపోర్టులు డీఎస్పీల రిపోర్టులు కలెక్టరేట్ కు చేరిన తాసిల్దార్ రిపోర్టులు మాత్రం కుట్ర పూర్వకంగా బాది త కుటుంబాలకు ప్రభుత్వ సహాయం అందకుండా అగ్రకుల బాధితుల్ని తహసిల్ దార్ బాధితులుగా మార్చేశారన్నారు.

తమ దయ దక్షిణాల మీదనే తాము రిపోర్టు పంపితేనే మీకు ఉద్యోగం డబ్బులు వస్తాయని వేధిస్తున్నారన్నారు. కావున ఎస్సీ ఎస్టీ హత్య కేసుల్లో రిపోర్టు పంపని 13 మంది తహసీల్దారులపై (1) నాగులప్పలపాడు (2) పొదిలి (3) దర్శి(4) అర్ధవీడు(5) ఎర్రగొండపాలెం(6) ఒంగోలు(7) అర్ధవీడు(8) గిద్దలూరు(9) త్రిపురాంతకం(10) బేస్తవారిపేట(11) జరుగుమల్లి(12) (13) మార్కాపురం విధి నిర్వహణలో అలసత్వం వహించిన తహసిల్దార్లకు ఎస్టీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేయాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గోపాలకృష్ణకు దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు ఫిర్యాదు చేశారు. వారం రోజుల్లో రిపోర్టులు తెప్పించి రిలీఫ్ అందజేస్తామని రీఛార్జి కలెక్టర్ దళిత నాయకులు నీలం నాగేంద్రరావు మాల మహానాడు అధ్యక్ష కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాను రవిలకు తెలిపారు.

## ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పొదిలి డిపో సందర్శన









(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 5)

ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సురెష్‌రెడ్డి సుదర్శన్ రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా శనివారం సాయంత్రం పొదిలి ఆర్టీసీ డిపోను సందర్శించారు. డిపోలో ప్రయాణికుల ప్రాంగణం, భోజనశాల, బస్సులు, టాయిలెట్స్, అన్ని పరిశీలించారు. ప్రయాణికులు, స్థానిక ప్రజలు సమస్యలు ప్రత్యక్షంగాను విజ్ఞాపన రూపంలో తెలియజేశారు. డిపో గ్యారేజ్ లో పరిశుభ్రతతో నిర్వహిస్తున్న స్టాఫ్ ను ప్రత్యేకంగా శాలువకప్పి అభినందించారు. డిపో మేనేజర్ శంకరావుకి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. డిపో లోని ముఖ్యమైన సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. చైర్మన్ సురేష్‌రెడ్డి వెంట ఆర్టీసీ అధికారులు, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు మాకినేని అమర సింహం, జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి, తెలుగుదేశం సీనియర్ నాయకులు బెల్లంకొండ శ్రీనివాసరావు, మైనార్టీ జిల్లా కో కన్వీనర్ ఎస్ డి ఖాదర్బాషా, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ చంద్రశేఖర్, పొదిలి మండల అధ్యక్షుడు దోర్నాల రమణారెడ్డి, కొనకలమిట్ల మండలాధ్యక్షుడు సురేష్ బాబు, పొదిలి పట్టణ అధ్యక్షుడు యుద్ధం మహేష్, బిజెపి యూత్ ప్రెసిడెంట్ షేక్ రఫీ, సీనియర్ నాయకులు మాగులూరి రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రెండో రోజు కొనసాగిన ధర్నా



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 5)

ఏపీ పిటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మార్కాపురం డిపో ఎదుట యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు జనార్ధనరావు అధ్యక్షతన రెండోరోజు ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ ధర్నాను ఉద్దేశించి జోనల్ సహాయ కార్యదర్శి ఎస్‌వీఎస్ శాస్త్రి మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులందరికీ గత ఆరేళ్లుగా పెండింగ్ లో ఉన్న ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలి, ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 10 వేల మంది సిబ్బంది నియామకాలకు ప్రభుత్వం వెంటనే అనుమతులు ఇవ్వాలని, ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ ఏ సొంతంగా కొనుగోలు చేయాలని, ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణకు తిప్పాలని, ప్రైవేట్ ఆపరేటర్లకు లీజ్ కు ఇచ్చే విధానాన్ని విరమించుకోవాలని, ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ సిబ్బందితోనే నడపాలని ఆర్టీసీ యాజమాన్యానికి మరియు ప్రభుత్వానికి తెలియజేసినారు. జిల్లా ఉపాధ్యక్షులు జనార్ధన రావు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఐఆర్ వెంటనే ప్రకటించాలని, 12వ పీఆర్‌సీ కమిషన్ వెంటనే నియమించాలని ఆర్టీసీ ఉద్యోగుల ఉద్యోగ భద్రతకు సంబంధించిన సర్కులర్ నెంబర్ :01/2019 యధావిధిగా అమలు జరిగేలా స్పష్టమైన ఆదేశాలు వెంటనే ఇవ్వాలని, ఆర్టీసీ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్ లో చేర్చాలని కోరారు. కేఎంపీఎల్ పై డ్రైవర్లను వేధించడం మానుకోవాలని, చాలా కాలం నుండి ఒకే సీటులో డిస్పాచ్ మెకానిక్‌ను, కేఎంపీఎల్ మెకానిక్‌ను కొనసాగించడం కరెక్టు కాదని వెంటనే డిపో మేనేజర్ చొరవ తీసుకొని వారిని వెంటనే మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో , జిల్లా ప్రచార కార్యదర్శి శేఖర్ నాయుడు, డిపో కార్యదర్శి నాని, ఎడిసి నాగేశ్వరరావు, లాబాను, వై ఆర్ ప్రసాద్, సీహెచ్ వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, జాకీర్ హుస్సేన్, శంకరయ్య, గోవిందరెడ్డి, పీఎస్ నాయక్, డ్రైవర్ వలి, గ్యారేజీ అధ్యక్ష కార్యదర్శులు రాజేష్, మోహన్ రావు, కోశాధికారి ఆంజనేయులు, మాజీ గ్యారేజీ కార్యదర్శి ఫ్రాన్సిస్‌లతో పాటు అత్యధిక మంది పాల్గొన్నారు.

## మెగా పీటీఎంలో విట్నెస్ అధికారిని నియామక ఉత్తర్వులు రద్దు చేయాలి

### యూటీఎఫ్ ప్రకాశం జిల్లా శాఖ డిమాండ్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 5)



ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో జరిగే మెగా పిటిఎం లో విట్నెస్ అధికారిని పాఠశాల హెడ్మాస్టర్ నియమించుకొని వారి చేత వీడియోలు తీయించి అప్లోడ్ చేయాలని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులు తక్షణమే రద్దు చేయాలని యుటిఎఫ్ ప్రకాశం జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ హై, డి వీరాంజనేయులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థులతో కలిసి విద్యార్థుల విద్యాభివృద్ధి మీద, పాఠశాలలో ఉన్న మౌలిక వసతుల సదుపాయాల మీద మాట్లాడుకోవటానికి 17 రకాల కమిటీలు, ఫోటోలు, అప్లోడ్లు, విట్నెస్ అధికారి ఇంత తతంగం అవసరమా? అని యుటిఎఫ్ ప్రశ్నిస్తుందని చెప్పారు. డాక్యుమెంట్రీ కార్యక్రమంగా మార్చడం సరికాదని విద్యార్థుల విద్యాభివృద్ధి గురించి చర్చించే కార్యక్రమంగా దాన్ని మార్చాలని యుటిఎఫ్ కోరుతుందన్నారు. బోధనకు మాత్రమే ఉపాధ్యాయులను పరిమితం చేస్తామని చెప్పిన పాఠశాల విద్యాశాఖ దానికి భిన్నంగా బోధ నేతల కార్యక్రమాలకు ఉపాధ్యాయ వినియోగిస్తుందని విమర్శించారు. పాఠశాలలు ప్రారంభమైన నెల రోజుల లోపే యోగా పేరుతో వారం రోజులు, మెగా పిటిఎం పేరుతో మరో వారం రోజులు బోధన సమయాన్ని హరిస్తుందని తెలిపారు. ఒక ప్రక్క విద్యార్థుల ఔట్పుట్ కోసం పరివేక్షణ అధికారులు వస్తారని చెబుతూ మరో ప్రక్క బోధ నేతల కార్యక్రమాలు చుట్టూ ఉపాధ్యాయుల ను తిప్పుతున్నారని తెలిపినారు ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయకుండా బోధనేతర కార్యక్రమాల పేరుతో ఒత్తిడికి గురి చేసే విధానాన్ని ఉపసంహరించుకోవాలని యుటిఎఫ్ డిమాండ్ చేస్తుందని తెలిపినారు ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు పాఠశాల సమయంలో ఉపాధ్యాయుల బోధనకు మాత్రమే పరిమితం చేయాలని అన్నారు మెగా పిటీఎంలో విట్నెస్ అధికారిని నియమించుకోవాలని ఇచ్చిన ఉత్తర్వులును తక్షణమే రద్దు చేయాలని యుటిఎఫ్ ప్రకాశం జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ హై, డి వీరాంజనేయులు డిమాండ్ చేశారు.

## జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు జయప్రదం చేయాలి



(షణ్ముఖ వెలుగు, కంభం, జులై 5)

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం స్వదేశి విదేశీ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మికులను కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్ తెచ్చింది. వీటిని రద్దు చేయాలని కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలని కాంట్రాక్టర్ ఔట్సోర్సింగ్ ఉద్యోగ కార్మికులను పర్మినెంట్ చేయాలని స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తింపు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయరాదని,పెన్షన్ ఉపాధి భద్రత కల్పించాలని కోరుతూ కంభం పట్టణం కందులాపురం సెంటర్ లో ప్రచారజాత కార్యక్రమం నిర్వహించిన అనంతరం జూలై 9వ తేదీన జరగబోయే దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెకు కేంద్ర కార్మిక సంఘాలు ఉద్యోగ సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు, శ్రామికులు, రైతులు పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి డి కె యం రఫీ కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ జిల్లా కమిటీ సభ్యులు రూబెన్, కంభం మండల సీఐటీయూ కన్వీనర్ షేక్. అన్వర్,ముఠా పలక రిక్షా కార్మికులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## 2, 50వ డివిజన్‌లలో ఎమ్మెల్యే జనార్ధన్ పర్యటన





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 5)

సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు నగరంలోని 2, 50 డివిజన్లలో పర్యటించారు. ముందుగా 50వ డివిజన్లోని నెహ్రూ నగర్‌లో ప్రతి ఇంటికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేశారు. అదే సమయంలో వారికి అందుతున్న పథకాల గురించి తెలుసుకున్నారు. నెహ్రూ నగర్ లోని ఒక ఇంటిలో దాసరి రాజ్యం అనే వృద్ధ మహిళ పక్షవాతంతో మంచంలో ఉండటాన్ని దామచర్ల గుర్తించి నేరుగా ఆమెను పరామర్శించారు. పింఛన్ వస్తుందా అని ఆ వృద్ధ మహిళ కుటుంబ సభ్యులను అడగ్గా, రాలేదంటూ సమాధానం ఇవ్వడంతో వెంటనే పింఛన్ వచ్చేలా చూడాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఆ తర్వాత 2 వ డివిజన్ లోని బిలాల్ నగర్లో ఇంటింటికి దామచర్ల వెళ్లి సుపరిపాలనలో తొలి అడుగు గురించి ప్రజలకు వివరించారు. కొంతమంది తమకు డ్రైనేజీ సమస్య ఉందని, తాగు నీరు సక్రమంగా రావడం లేదని తెలిపారు. వెంటనే ఆ సమస్యలను పరిష్కరించాలని ఎం ఎల్ ఏ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సమీపంలో ఉన్న పోతురాజు కాలువను కూడా పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడు బండారు మదన్, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకురాలు రావుల పద్మజ, తదితరులు ఉన్నారు.

## 24వ డివిజన్‌లో తొలి అడుగు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 5)

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు గారి ఆదేశానుసారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా 24వ డివిజన్ బండ్లమెట్ట ప్రాంతంలో ఇంటింటికి తిరిగి కరపత్రం పంచుతూ కూటమి ప్రభుత్వాన్ని ఇస్తున్న పథకాలన్నీ వస్తున్నాయా లేదా అని నీకు తెలుసుకున్నారు, డివిజన్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి డివిజన్ అధ్యక్షులు రాంబాబు , డివిజన్ కార్పొరేటర్ బేతంచెట్టి శైలజ, బూత్ కన్వీనర్ జానపాటి నరేష్, గుంజి వెంకటేష్, కన్వీనర్, క్లస్టర్ ఇంచార్జ్ లేకపోతే వెంకటేశ్వర్లు, అబ్జర్వర్ రావెంట్ల జెస్సి, మహిళా అబ్జర్వర్ బోను దుర్గ, ఎస్కే జాన్ బి, వరలక్ష్మి, అంజమ్మ, బివి వంశీధర్, బందర్ మహేష్, నల్ల

# నూతన గిరిజన కళాశాల విద్యార్థినుల వసతి గృహాన్ని ప్రారంభించిన ఎరిక్షన్ బాబు









(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, జులై 5)

యర్రగొండపాలెం పట్టణంలోని మాచర్ల రోడ్డులో నూతన గిరిజన కళాశాల బాలికల హాస్టల్ ను యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ప్రారంభించారు. నియోజకవర్గంలోని గిరిజన విద్యార్థినులకు ఈ వసతి గృహం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహ ఏర్పాటుకు సహకరించిన సీఎం చంద్రబాబు , మంత్రులు నారా లోకేష్ గుమ్మడి సంధ్యా రాణి గారు, డోలా బాల వీరాంజనేయ స్వామి ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, టీడీపీ కూటమి నాయకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# తంగేళ్ల గ్రామాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన బిపిఓ గొట్టిపాటి వెంకట నాయుడు






(షణ్ముఖ వెలుగు, మద్దిపూడి, జులై 5)

గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరి శుభ్రంతతో పాటు పరిసరాల పరిశుభ్రతలను పాటించి అందరూ ఆరోగ్యవంతంగా ఉండాలని ప్రభుత్వ లక్ష్యానికి సహకరించాలని డిపిఓ గొట్టిపాటి వెంకట నాయుడు కోరారు. శనివారం మండలంలోని తంగెళ్ల గ్రామాన్ని ఆకస్మిక తనిఖీ చేసి పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఉదయాన్నే ప్రతి ఇంటికి వెళ్లి తడి చెత్త పొడి చెత్త ను వేరువేరుగా సేకరించాలని అలా చేయడంవల్ల కలిగే ప్రయోజనాలను మహిళలకు వివరించారు వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు మన పట్ల దరి చేరవని అందరూ ఆరోగ్యంగా ఉండవచ్చు అని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో షేక్ నాగూర్ వలి,పంచాయతీ కార్యదర్శి సిహెచ్ సుధీర్ కుమార్,పారిశుద్ధ్య కార్మికులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలతో స్థితిగతులను మెరుగుపర్చుకోవాలి

## జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జులై 5)

ప్రభుత్వం అందించే వివిధ పథకాల ప్రయోజనాలను లబ్ధిదారులు అందిపుచ్చుకొని వారి స్థితిగతులను మెరుగుపరుచుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. శనివారం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులకు యంత్రాలు, చెక్కులు పంపిణీ చేశారు. ప్రజల జీవనోపాదులు మెరుగుపరచుకోవడానికి మెప్మా శాఖ ద్వారా చీరాల మండలంలో 2, బాపట్ల మండలంలో 2 లబ్ధిదారులకు ఎలక్ట్రికల్ ఆటోలను ముద్రా రుణం కింద జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు అందజేశారు. ఒక్కొక్క యూనిట్ ఖరీదు 3 లక్షల 63 వేలు, ఈ వాహనాలను రాపిడో సంస్థతో అనుసంధానించడం ద్వారా లబ్ధిదారులకు 56 వేలు ప్రోత్సాహకం అందజేయబడుతుందని వారు తెలిపారు.జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా 646 మంది సభ్యులకు బ్యాంకు లింకేజీ పథకం ద్వారా, 3686 మందికి శ్రీనిధి పథకం ద్వారా, 384 మందికి లక్ పతి దిది ద్వారా, 14 మంది సభ్యులకు ఉన్నతి పథకం ద్వారా 53 కోట్ల 42 లక్షల రూపాయల చెక్కును, మెప్మా శాఖ ద్వారా 340 మంది స్వయం సహాయక గ్రూపు సభ్యులకు వివిధ బ్యాంకుల ద్వారా సూక్ష్మ చిన్న మరియు మధ్య తరహా రుణం క్రింద 5 కోట్ల 20 లక్షల రూపాయల చెక్కులను జిల్లా కలెక్టర్ మరియు బాపట్ల శాసనసభ్యులు లబ్ధిదారులకు అందజేశారు. జిల్లా కలెక్టర్ వద్ద గల డి ఎం ఎఫ్ నిధుల నుండి సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలకు, సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలకు, గిరిజన పోస్ట్ మెట్రిక్ హాస్టల్ కు మొత్తం 68 యూనిట్లకు 8 సీసీ కెమెరాలు చొప్పున మొత్తం 544 కెమెరాలను ఒక కోటి 47 లక్షల రూపాయలు వెచ్చించి వారికి అందజేశారు. సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ని 1227 మంది విద్యార్థులకు ఒక కోటి 18 లక్షలు, వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహంలోని 925 మంది విద్యార్థులకు 57 లక్షల 22 వేల రూపాయలు వెచ్చించి స్టడీ చైర్లు, పూరి మేకర్లు, బాండ్లీలు, ఆర్వో ప్లాంట్లు, వేడినీళ్ల గీజర్లు, టీవీలు, ఎయిర్ కూలర్ల ను జిల్లా కలెక్టర్ మరియు బాపట్ల శాసనసభ్యులు వసతి గ్రహాలకు అందజేశారు. జిల్లాలోని 2200 మంది క్లాత్ మిత్ర, శానిటేషన్ కార్మికులకు డిఎంఎఫ్ నిధుల నుండి 47 లక్షలు వెచ్చించి 5 రకాల భద్రతా పరికరాలను (బూట్లు, గ్లౌజులు, హెల్మెట్లు, మాస్కులు, ఏప్రాన్) జిల్లా కలెక్టర్, బాపట్ల ఎమ్మెల్యే అందజేశారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద 3 గ్రూపులకు వ్యవసాయ డ్రోన్లు, ముగ్గురికి పవర్స్ ప్రేయర్లు, ఒకరికి బ్యాటరీస్ ప్రేయర్ ను జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి మరియు బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ లబ్ధిదారులకు అందజేశారు. వ్యవసాయ డ్రోన్ల వినియోగంలో ఒక్కొక్క గ్రూపులో 5 గురు సభ్యులు ఉంటారని, ఒక యూనిట్ ఖరీదు 9 లక్షల 80 వేల రూపాయలు, అందులో గ్రూపుకు 80 శాతం సబ్సిడీ కింద 7 లక్షల 84 వేల రూపాయలు వస్తుందని, రుణం ఒక లక్ష 96 వేల రూపాయలని, అదేవిధంగా పవర్ స్ప్రేయర్లు, బ్యాటరీ స్ప్రేయర్లలో లబ్ధిదారులకు 80 శాతం సబ్సిడీ వస్తుందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి




తెలిపారు. ఈ కార్యక్రమంలో 5 గురు సభ్యులకు సిసిఆర్సి కార్డులు అందజేశారు. అలింకో, కాన్పూర్ వారి ద్వారా విభిన్న ప్రతిభావంతులలో ఇద్దరికీ మోటారు సైకిళ్ళు, ఒకరికి ట్రై సైకిల్, 4 గురికి వీల్ చైర్లు, ఇద్దరికీ వినికిడి యంత్రాలను (కుడి, ఎడమ) జిల్లా కలెక్టర్, బాపట్ల శాసనసభ్యులు అందజేశారు. మెప్మా శాఖ ద్వారా ప్రతి మండలంలో, ప్రతి వార్డులో సి ఎస్ సి కేంద్రాల ద్వారా డిజిటల్ సర్వేసుల నిర్వహణకు డిజిటల్ లక్ష్మి కార్యక్రమం ద్వారా మెప్మా శాఖ సిబ్బంది 56 మందికి బయోమెట్రిక్ యంత్రాలను, 30 మందికి ట్యాబ్ లను జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు, పిడి డిఆర్డిఏ శ్రీనివాసరావు, ఎస్ సి సంక్షేమ శాఖ అధికారి రాజ్ దేబోరా, బి సి సంక్షేమ శాఖ అధికారి శివలీల, వ్యవసాయ శాఖ జెడి రామకృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి గ్లోరియా, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి,సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ ఎం జ్యోత్స్న, తదితరులు పాల్గొన్నారు.

# ఆప్షనల్ హాలిడే కోసం ఉపాధ్యాయులను మతాలు, కులాల వారీగా విడగొట్టడం సబబు కాదు

## యుటీఎఫ్ ప్రకాశం జిల్లా శాఖ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 5)

ప్రపంచంలోనే భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం గల ఏకైక విభిన్న లౌకిక దేశం. మన భారత దేశంలో విభిన్న జాతులు, మతాలు, కులాలు, సాంస్కృతి సాంప్రదాయాలు, పండుగలు నెలకొన్న అతి గొప్పదైన దేశం. భారత్లో అనాదిగా అందులో ఆంధ్రప్రదేశ్లో హిందువులు, ముస్లింలు,క్రైస్తవులు కలిసిమెలిసి కొన్ని పండుగలు జరుపుకుంటున్న భిన్నమైన సాంస్కృతి గల రాష్ట్రం. ముస్లింల మొహరం పండుగను, హిందువులు జరిపే దీపావళి, వినాయక చవితి పండుగలను అన్ని మతాలవారు కలిసి జరుపుకునే సాంప్రదాయం గల మన రాష్ట్రం. గ్రామీణ ప్రాంతంలో మొహరం పండుగ పీర్లను 9వ రోజు అత్యంత పవిత్రంగా జరుపుతారు. పీర్లను ఎక్కువ మంది హిందువులు ముస్లింలు కలిసి సమైక్యంగా జరుపుకునే అతి ప్రధానమైన పండుగ. ఈ పండుగను 10వ రోజు నుండి 12వ రోజు వరకు నెల్లూరు నగరంలో రొట్టెల పండుగగా భారాషాహీద్ దర్గాలో కొన్ని లక్షలమంది వివిధ దేశాల నుండి, వివిధ రాష్ట్రాల నుండి, ప్రాంతాల నుండి తరలివచ్చి జరుపుకుంటారు. ఈ విధంగా అందరూ కలిసి మెలిసి ఐక్యంగా జరుపుకునే పండుగల ఆప్షనల్ హాలిడేస్ సెలవులను రాష్ట్ర విద్యాశాఖ అధికారులు మతాలు వారిగా, కులాలు వారిగా విభజించి సెలవు ఇవ్వడం, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ రచించిన భారతదేశ లౌకిక రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా ఉన్నది అని అన్నారు.



సెలవులు కూడా విద్యార్థులకు వర్తించవా? గ్రామీణ ప్రాంతంలో మొహరం పండుగ జరుపుకోవాలని పీర్ల ఊరేగింపులో తిరగాలని విద్యార్థులు మానసికంగా ముందుగా సిద్ధమై ఉంటారు. (జూలై నెల 5వ తేదీ ఆప్షనల్ హాలిడే 9వ మొహరం పండుగను)మొహరం పండుగ రోజు అందరూ కలిసి చిన్న పెద్ద తేడా లేకుండా విద్యార్థులు , ఉపాధ్యాయులు తల్లిదండ్రులు కలిసి సంతోషంగా జరిపే పండుగను విద్యార్థులకుసెలవులు ఇవ్వకుండా, కొన్ని మతాల వారికి సెలవు ఇవ్వడం మరికొన్ని మతాల వారి మీద ఆంక్షలు విధించడం ప్రాథమిక హక్కులను, బాలల హక్కులను హరించడం అవుతుందన్నారు. మానసిక శాస్త్రవేత్తలు చెప్పిన మౌలిక సూత్రం ప్రకారం విద్యార్థులు ఉపాధ్యాయుల కు కలిసి సెలవు ఇస్తారు దాని వలన అటు ఉపాధ్యాయుల్లో కొంత ఒత్తిడి తగ్గి వారు ఉల్లాసంగా, ఉత్సాహంగా పాఠాలు చెప్పడానికి విద్యార్థులు కూడా మానసిక ఒత్తిడికి గురికాకుండా శ్రద్ధగా పాఠాలు వినటానికి ఈ సెలవులు ఉపయోగపడతాయన్న ప్రాథమిక సూత్రాన్ని విద్యాశాఖ అధికారులు పెడచెవిన పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర విద్యాశాఖ అధికారులు విద్యార్థులకు ఉపాధ్యాయులకు కలిసి స్కూల్ యూనిట్ గా సెలవు మంజూరు చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నాదని ప్రకాశం జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ హై, డి.వీరాంజనేయులు రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

# పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించాలి




## స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి

## దానీతో జరిగిన విద్యుత్ ఒప్పందాలను రద్దుచేయాలి...

## సిపిఐ కనిగిరి మండల కార్యదర్శి రామారావు

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 5)

పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించాలని స్పోర్ట్ మీటర్ల ఏర్పాటు చేయడానికి వ్యతిరేకిస్తూ ప్రధానితో కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందాలు రద్దు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సీపీఐ కనిగిరి మండలసమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ కనిగిరి మండల కార్యదర్శి జి పి రామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలో విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15.485 కోట్ల భారం ప్రజలపై మోపింది. అంతేగాక గృహాలకు స్మార్ట్ మీటర్లను బిగించేందుకు మోడీ ప్రభుత్వవిధానాలను తీసుకోస్తున్నది. కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలనుమరచి విద్యుత్ చార్జీల భారాలను మోపటం ప్రజలను మోసగించడమే. గతంలో చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉండగా విద్యుత్ చార్జీల పెంపుదలను తీవ్రంగా వ్యతిరేకించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకోవాలని, అవసరమైతే పగలగొట్టాలని సూచించారు. అదానీతో జరిగిన సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకివస్తే విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేస్తామని, అక్రమంగా జరిగిన సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. కాని రాష్ట్రంలో కూటమిప్రభుత్వము ఏడాది కాలంలో 4 సార్లు విద్యుత్ చార్జీల భారాలను వినియోగదారులపై మోపారు. గృహ వినియోగాలకు సంబంధించి విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించేందుకు సిద్ధమయ్యారు, గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆదానీతో చేసుకున్న ఒప్పందాల వల్ల రానున్న 25 ఏళ్లపాటు దాదాపు ఒక లక్షా పదివేల కోట్ల రూపాయల భారం ప్రజలపై పడుతుంది. ఈ ఒప్పందాలపై కూటమి ప్రభుత్వం కనీసం సమీక్షగాని, కనీసం నోరు మెదపడంగానీ చేయడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని అదానీతో జరిగిన సోలార్ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని భారతకమ్యూనిస్టుపార్టీసిపిఐ డిమాండ్ చేస్తున్నది. తొలుత దర్శి చెంచయ్య భవన్ సిపిఐ కార్యాలయం నుండి ప్రదర్శన నిర్వహించి పామూరు బస్టాండు ఆర్డిఓ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించడం జరిగినది. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డిఓ కార్యాలయ సిబ్బంది ఎం రమేష్ కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గుజ్జుల బాలిరెడ్డి, యేరువారిపల్లి శాఖ కార్యదర్శి యు వెలుగొండయ్య, విద్యార్థి, యువజన సంఘం నాయకులు పుట్టా సుబ్బారావు, సిహెచ్ పవన్ కళ్యాణ్, ఎలమందరెడ్డి, కాలనీ నాయకులు అంకమ్మ, అన్నపూర్ణ, ఆదిలక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# జూలై 9 సార్వత్రిక సమ్మెకు మద్దతుగా గ్రామీణ ప్రాంతాల్లో నిరసన

## వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 5)
ప్రధాని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె, గ్రామీణ ప్రాంతాలలో నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపు ఇచ్చారు. శనివారం ప్రజాసంఘాల కార్యాలయంలో సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ కార్మిక వర్గం అనేక త్యాగాలతో, పోరాటాలతో సాధించుకున్నాం 29 చట్టాలను నిర్వీర్యం చేసి 4 లేబర్ కోడ్లుగా కుదించి హక్కులు లేకుండా చేస్తున్నారని అన్నారు. సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు, ఎనిమిది గంటల పని దినం లాంటి కనీస హక్కులు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని అన్నారు. రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తాం సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగాన్ని వెలికి తీస్తామని చెప్పిన మోడీ మాటలు నీటి మాటలయ్యాయని అన్నారు. వ్యవసాయ రంగం మరింత సంక్షోభంలోకి కూరుకుపోయి రైతుల ఆదాయాలు రెట్టింపు కాకపోగా ఆత్మహత్యలు రెట్టింపు అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలో ముంచి, దానిపై ఆధారపడి జీవిస్తున్న రైతాంగాన్ని, మన పంట భూములను కార్పోరేట్లకు కట్టబెట్టేందుకు ఈ విధానాలనుసరిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రకృతి వనరులను అందిన కాడికి కార్పోరేట్ శక్తులకు మోడీ ప్రభుత్వం దోచిపెడుతున్నదని అన్నారు. ఫలితంగా సామాజిక న్యాయం, ఉద్యోగ భద్రత లేకుండా దేశంలో ఒక అశాంతి వాతావరణం ఏర్పడుతున్నదని అన్నారు. మరోవైపు వ్యవసాయ కార్మిక సంఘం, వామపక్ష పార్టీలు చేసిన అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని నిధులు తగ్గించి మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని అన్నారు. పేదరిక నిర్మూలన, వలసల నివారణ, గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత వనరుల కల్పన లాంటి ఉన్నత లక్ష్యాలతో ఉపాధి హామీ చట్టం అమలులోకి తెచ్చారని అన్నారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు పూర్తయిన తర్వాత పేద ప్రజలు వలసలు పోకుండా వారి జీవన ప్రమాణాలు మెరుగుపరుచుకునేందుకు ఈ చట్టం అనేక విధాల దోహదపడుతుందని అన్నారు. ఇలాంటి చట్టానికి మరింత నిధులు పెంచి పట్టణాలకు కూడా విస్తరించాలని ప్రజలు కోరుతుంటే పాలకులు ఉన్నచట్టాన్ని నిర్వీర్యం చేసే చర్యలకు పాల్పడటం విచారకరమని అన్నారు. దేశంలో ఆర్థిక సంక్షోభ నివారించబడాలంటే ప్రజల కొనుగోలు శక్తి పెరగాలని అందుకు ఉపాధి హామీ లాంటి చట్టాలు దోహద పడతాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ విధానాలను నిరసిస్తూ జూలై 9వ తేదీన దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె జరుగుతుందని, ఈ సమ్మెకు వ్యవసాయ కార్మికులంతా సంపూర్ణ మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కర్షక విధానాలను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సమర్ధించటం సిగ్గుచేటని అన్నారు. ఒక చట్టం సాధించబడాలంటే అనేక పోరాటాలు, త్యాగాలు చేయాల్సి వస్తుందని అటువంటి చట్టాలను ఒక కలం పోటుతో కేంద్రం నిర్వీర్యం చేయడం, రద్దు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడకపోవడం అన్యాయమని అన్నారు. ప్రజా ప్రయోజనాలకు కొత్త చట్టాలు చేయకపోగా ప్రమాదకరమైన ప్రజా వ్యతిరేక చట్టాలు కేంద్రం చేస్తున్నదని వాటికి వ్యతిరేకంగా జరిగే సార్వత్రిక సమ్మెలో, గ్రామీణ నిరసనలలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఊసా వెంకటేశ్వర్లు, అన్నవరపు శేషారావు, కంకణాల వెంకటేశ్వర్లు, గడ్డం పిచ్చయ్య, గోగుల నారాయణ, ఉబ్బా వెంకటేశ్వర్లు, తలారి ఆదాం,

# అన్ని న్యాయస్థానాల్లో జాతీయ లోక్ అదాలత్





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 5)
జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల ప్రకారం ఈ నెల 5వ తేదీన ప్రకాశం జిల్లా వ్యాప్తంగా అన్ని న్యాయస్థానాలలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరిగిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.భారతి అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో సుమారు 155 సివిల్ వ్యాజ్యాలు దాదాపుగా 5200 క్రిమినల్ వ్యాజ్యాలు మరియు ప్రీ లిటిగేషన్ స్థాయిలో 17 కేసులు పరిష్కరించడం జరిగిందని తెలియజేశారు. ఈ సందర్భంగా కక్షదారులకు మోటార్ వాహన ప్రమాద బీమా కేసుల్లోనూ, కొన్ని రకాలైన ఇతర కేసుల్లో దాదాపుగా ఎనిమిది కోట్ల రూపాయలు పరిష్కారం రూపంలో చెల్లింపులు చేయడం జరిగిందని తెలిపారు. ఈరోజు కేసుల పరిష్కారం కోసం ప్రకాశం జిల్లా వ్యాప్తంగా 27 బెంచీలు ఏర్పాటు చేయడం జరిగిందని ఈ బెంచీలలో న్యాయమూర్తులు ,న్యాయవాదులు సమస్యలు పరిష్కారం కోసం కృషి చేశారని తెలిపారు. న్యాయస్థానాల్లో పెండింగ్లో ఉన్న సమస్యలు పరిష్కారం కోసం సహకరించిన న్యాయవాదులకు పోలీస్ వారికి వివిధ ప్రభుత్వ శాఖల ప్రతినిధులకు, బ్యాంకు అధికారులకు, ఇన్సూరెన్స్ అధికారులకు న్యాయ సేవాధికార సంస్థ తరపున అభినందనలు తెలిపారు

# పెండింగ్ కేసుల పై అధిక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించాలి

**సైబర్ నేరాలపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలి**
**నేరాల కట్టడి, రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి**
**ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పోలీస్ శాఖపై**
**మరింత నమ్మకం పెంపొందించేలా సేవలు అందించాలి**
**జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్**





(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 5)
సాధారణ తనిఖీల్లో భాగంగా కనిగిరి సబ్ డివిజన్ పరిధిలోని పామూరు, చంద్రశేఖర్పురం, వెలిగండ్ల పోలీస్ స్టేషన్ లను జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ శనివారం తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్లోని పరిసరాలు, పలు రికార్డ్స్, రిషప్షెన్ రిజిష్టర్ ని తనిఖీ చేసి మండల పరిధిలో తరచుగా నమోదవుతున్న నేరాలు, పిర్యాదుల తీరుతెన్నులు, కేసుల స్థితిగతులు మొదలగు అంశాలను పరిశీలించారు. పోలీసు సిబ్బంది ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని, సంఘటనలపై, ప్రజా పిర్యాదు వేగంగా స్పందించాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తులో నాణ్యమైన వేగవంతమైన దర్యాప్తు చేయాలని బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రజలను భాగస్వామ్యం చేస్తూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. రహదారి వెంట భద్రతను బలోపేతం చేసి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై విస్తృతంగా స్కూల్, కళాశాలల్లో అవగాహన కల్పించాలని, గంజాయి వంటి మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే దుష్ప్రభావాలు, చట్టాలు, గురించి, అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలు అత్యాశకు పోవద్దు సైబర్ మోసాల బారిన పడుద్దు, ఎది ఊరికే రాదు అని గ్రహించాలి, అపరిచితులు ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు అడిగిన, బహుమతులు, తక్కువ వడ్డీ రుణాలు, ప్రభుత్వ పథకాలు అంటూ ఆశ చూపితే సైబర్ మోసగాడు అని గుర్తించాలని జిల్లా ఎస్పీ గారు విజ్ఞప్తి చేశారు. ప్రయాణ సమయంలో జాగ్రతగా ఉండాలి మద్యం మత్తులో వాహనాలు నదపవద్దు, నిర్లక్ష్యంగా ఉండవద్దు, పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దు, వాహనదారులు వాహనాలను నడిపేటప్పుడు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని పాటించాలని కోరారు. పోలీసు స్టేషన్కు ఫిర్యాదు చేయుటకు వచ్చే ఫిర్యాదులుదారులు పట్ల, మర్యాదపూర్వకంగా మాట్లాడి వారి యొక్క సమస్య తెలుసుకొని వెంటనే విచారణ చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఎస్పీ సూచించారు. జిల్లా ఎస్పీ వెంట కనిగిరి డివిస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, ఎస్ బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, పామూరు సీఐ భీమా నాయక్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.






# గుడ్లూరులో నకిలీ మద్యం తయారీ గుట్టురట్టు





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 5)
గుడ్లూరు గ్రామానికి చెందిన ఉప్పలపాటి వీరాంజనేయులు ఇంటిపై ఎక్సైజ్ అధికారుల సోదాలు నిర్వహించారు. మద్యం తయారీకి ఉపయోగించే, 400 లీటర్ల రెక్టిఫైడ్ స్పిరిట్ స్వాధీనం చేసుకున్నారు. మద్యం తయారీకి మద్యం తయారికి ఏకంగా ఇంట్లోనే మిషనరీ ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. వీరాంజనేయులు ఇంట్లో భారీగా ఖాళీ డబ్బాలు, మద్యం సీసాలు ఉన్నాయి. గోదావరి, నెల్లూరు జిల్లాలో ఇటీవల దాడులు చేసి కొంతమందిని అదుపులోకి తీసుకోగా వారిచ్చిన సమాచారంతో గుడ్లూరులో సోదాలు నిర్వహించినట్లు సమాచారం. నకిలీ మద్యం తయారీకి స్థానిక నేతల సహకారం ఏమైనా ఉందా అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఎక్సైజ్ అధికారుల అదుపులో నిందితుడు ఉన్నట్లు తెలుస్తుంది.

# రాష్ట్ర స్థాయి పోలు రాధా ఎడ్ల బల ప్రదర్శన



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 5)
కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామంలో రాష్ట్ర స్థాయి పోలు రాధా ఎడ్ల బల ప్రదర్శన పోటీలను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు ప్రారంభించారు. అనంతరం దామచర్ల జనార్ధన్ రావు మీడియాతో మాట్లాడుతూ రైతులు సంబరంగా ఎద్దుల పందేలు ఆనవాయితీగా చేసుకుంటారన్నారు. గతంలో ఒకసారి కొత్తపట్నంలో ఇలాంటి పోటీలు జరిగాయని, మొదటిసారిగా అల్లూరులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు వచ్చిన వారికి కమిటి సభ్యులు పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని దామచర్ల జనార్ధన్ రావు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు జరగనున్నాయి.







# జిల్లా కలెక్టర్ జె వెంకట మురళిని కలిసిన గనుల శాఖ సహాయ సంచాలకులు రామచంద్రయ్య



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జులై 5)
గనుల శాఖ సహాయ సంచాలకులుగా రామచంద్రయ్య బాధ్యతలు చేపట్టిన అనంతరం మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ జె వెంకట మురళిని కలిసి మొక్కను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్కు శుభాకాంక్షలు తెలిపారు.

## కృష్ణాపురం గ్రామంలో ఘనంగా ఇంటూరి నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు









(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 5)

మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో గ్రామ సర్పంచ్ మందాడి హనుమంతరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేసి నాయకులకు, కార్యకర్తలు పంచిపెట్టారు. అనంతరం గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో మండల టిడిపి ఇంచార్జి పొడపాటి సుధాకర్, కందుకూరు తెలుగు యువత అధ్యక్షులు పోడపాటి మహేష్, అబ్బూరి వేణు, అబ్బూరి చందు, కృష్ణాపురం గ్రామ సర్పంచ్ మండాడి హనుమంతరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు చక్రవర్తుల విజయ్ కుమార్, మాజీ సర్పంచ్ కొల్లి శేషయ్య, మందాడి వినోద్ కుమార్, కల్లిపోతురాజు, నక్క మస్తాన్, మందాడి చిన్న వెంకయ్య, కేశవరం గంగాద్రి, కాకు ప్రసాదు, నక్క పవన్, అనిల్, కాకు లక్ష్మీనారాయణ, డబ్బు కొట్టి నవీన్, మందాడి కళ్యాణ్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ప్రజలు కూర్చునేందుకు 7 సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారు.

## 12, 13 తేదీల్లో బ్యాడ్మింటన్ ఎంపికలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 5)

జిల్లా బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు ఈనెల 12, 13 తేదీల్లో ఒంగోలు మంగమూరు రోడ్డులోని లార్డ్ శ్రీకృష్ణ అకాడమీలో జరుగుతాయని జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు జె. ఎస్. లక్ష్మణ రెడ్డి,జిల్లా కార్యదర్శి పి విజయ్ కృష్ణ వ్యవస్థాపక అధ్యక్షులు అద్దంకి మురళీకృష్ణ తెలిపారు. అండర్ 11, 13, 15, 17, 19 వయస్సు విభాగాల బాలబాలికలతో పాటు సీనియర్ మహిళ, పురుషులకు ఈ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ ఒరిజినల్ ఆధార్ కార్డు, వయస్సు ధ్రువీకరణ పత్రంతో ఈ నెల 10వ తేదీ సాయంత్రం ఆరుగంట లోపు ఫోన్ ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. టోర్నీలో పాల్గొనే క్రీడాకారులకు భోజన వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివరాలకు 939826 0109కు సంప్రదించాలన్నారు.

# టంగుటూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ ఏ ఆర్ దామోదర్

పోలీసు స్టేషన్ పరిసరాలు, రికార్డుల తనిఖీ
పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల తక్షణమే స్పందించాలి
జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్
నేర నియంత్రణ, అసాంఘిక,
చట్టవ్యతిరేక కార్యకలాపాల కట్టడికి గట్టి చర్యలు తీసుకోవాలి









(షణ్ముఖ వెలుగు, కొండపి ఇంచారి, జులై 5)

పోలీస్ స్టేషన్ స్థితిగతులు, సిబ్బంది పని తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించడానికి టంగుటూరు పియస్ ను శనివారం జిల్లా ఎస్పీ ఆకస్మికంగా సందర్శించి పోలీస్ స్టేషన్ ఆవరణాన్ని, గదులను, రిసెప్షన్ కౌంటర్, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకున్నారని ఇలానే కొనసాగించాలన్నారు. స్టేషన్ నిర్వహణ రికార్డులు, పట్టుబడిన ద్విచక్ర వాహనాలు, ఇతర వస్తువులు తనిఖీ చేసి వాటిని త్వరగా డిస్పోజల్ చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్, నేర నివారణ వ్యూహాలపై తీసుకుంటున్న చర్యలపై అధికారులను ఆరా తీసి పలు సూచనలు చేసారు. పోలీస్ స్టేషన్‌లో పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకొని వాటిని త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించాలని, వారితో మర్యాదగా, గౌరవంగా నడుచుకోవాలన్నారు. ప్రతి ఫిర్యాదు పై వెంటనే త్వరితగతిన స్పందించి, ప్రాథమిక విచారణను వేగంగా నిర్వహించి బాధితులకు భరోసా కల్పించాలని ఆదేశించారు. ఫిర్యాదుల స్వీకరణ, కేసుల నమోదులో ఎలాంటి జాప్యం ఉండవద్దని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్లో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు, వారి విధుల వంటి వాటిపై ఆరాతీశారు. రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, గస్తీ విధులు పటిష్టంగా నిర్వర్తించి నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. బీట్లు తిరిగే సమయంలో హిస్టరీ షీట్లు కలిగిన వారిని చెక్ చేయాలని, వారి కదలికలపై నిఘా పెట్టాలని, విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. స్టేషన్లో పని చేస్తున్న సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. ఈ అకస్మిక తనిఖీలో జిల్లా ఎస్పీ వెంట ఎస్బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, సింగరాయకొండ సిఐ హాజరత్తయ్య, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ పాండురంగారావు, టంగుటూరు ఎస్ఐ నాగమల్లేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

# సుపరిపాలనకు తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉంది

సుపరిపాలనలో తొలి ఏడాది కార్యక్రమంలో
మార్కాపురం ఎమ్మెల్యే కందుల



















(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 5)

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమంలో మార్కాపురం పట్టణం లోని 29 వ వార్డ్, మార్కాపురం మండలంలో రాయవరం గ్రామం, పొదిలి మండలంలో అన్నవరం గ్రామం, కొనకనమిట్ల మండలం లోని పెదారికట్ల గ్రామంలో పార్టీ శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెడలి పాంప్లెట్లు పంచి భూత్ ఇన్చార్జిలతో మై టిడిపి యాప్‌లో ఆ కుటుంబాల వివరాలు నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించిందని అయినా కూడా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలి ఏడాదిలోనే తమ హామీలకు కట్టుబడి కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉన్న అంతమంది విద్యార్థులకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేశారన్నారు. ప్రతి విద్యార్థి తల్లుల ఎకౌంట్లో ఒక్కో విద్యార్థికి రూ.13 వేలు జమ చేశారని అన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లతో వృద్ధులు వితంతువులకు నెలకు రూ.4,000, దివ్యాంగులకు రూ.6,000, కిడ్నీ, కాలేయం, తలసేమియా వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.10,000లు, పూర్తి వైకల్యం ఉన్నవారికి రూ.15వేలుగా మొత్తంగా రాష్ట్రంలో 65 లక్షల మంది లబ్ధిదారులకు పెన్షన్లు ఇస్తున్నారని అన్నారు. తమ ఎలక్షన్ల హామీ అయినటువంటి అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్ లు ఇస్తున్నారని అన్నారు. యువతకు 16,347 పోస్టులతో డీఎస్సీ నియామకాలు త్వరలోనే చేపట్టబోతున్నారని, పోలీస్ శాఖలు నియామకాలు జరిపారని, పారిశ్రామిక రంగంలో 8.5 లక్షల మంది ఉద్యోగాల కల్పనకు ఒప్పందాలు జరిగాయని అన్నారు. ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సదుపాయం కల్పించబోతున్నారని అన్నారు. రైతు సంక్షేమం కొరకు కేంద్రంతోపాటు రాష్ట్ర నిధులు జోడించి అన్నదాత సుఖీభవ పథకం త్వరలోనే ప్రారంభం అవుతుందని అన్నారు. అన్నా క్యాంటీన్లను పునరుద్ధరించి కేవలం ఐదు రూపాయలకే న్యాయమైన భోజనం అందిస్తున్నారని అన్నారు. ఒక్క సంవత్సరంలోనే రాష్ట్రానికి పలు బహుళ జాతి కంపెనీలను తీసుకువచ్చి వేల సంఖ్యలో ఉద్యోగ కల్పన చేశారని అన్నారు. గత వైసిపి పాలకులు పూర్తికాని వెలుగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారని, ఇంకా 4000 కోట్లు ఖర్చు చేస్తేనే ఆ ప్రాజెక్టు పూర్తి అవుతుందని త్వరలోనే ఆ ప్రాజెక్టును పూర్తి చేస్తామని అన్నారు. త్వరలోనే ప్రత్యేక మార్కాపురం జిల్లా సకారం చేస్తామని అన్నారు. టిడిపి శ్రేణులు వైసీపీ తప్పుడు ప్రచారాన్ని తిపి కొట్టాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురంలో మార్కాపురం ప్రతిపాదిత ఏఎంసి ఛైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జి కందుల రామిరెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ వక్కలగడ్డ మల్లిఖార్జున, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ళపల్లి సత్యనారాయణ, కొనకనమిట్ల మండల పార్టీ అధ్యక్షులు మూరబోయిన బాబురావుయాదవ్, గొట్లగట్టు సర్పంచ్ పెరికె సుఖదేవ్ (బూన్), ముప్వ కాటంరాజు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వరికూటి రామిరెడ్డి, పొదిలి మండల మాజీ జడ్పీటిసి సభ్యులు కాటూరి వెంకట నారాయణబాబు, పొదిలి ప్రతిపాదిత ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆవులూరి యలమంద, మాదాలవారిపాలెం సొసైటీ అధ్యక్షులు యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ (పండు), మాజీ శివాలయం కమిటీ ఛైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, ఏ అంజిరెడ్డి, తానికొండ వెంకట్రావు, ఏలూరి నాయకుడు ఉలవా గోపి, పొదిలి మండల వ్యవసాయశాఖ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com